బుధవారం
11-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 81
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నలుగురు వ్యోమగాములతో నింగిలోకి స్పేస్‌ఎక్స్ రాకెట్

ఫ్లోరిడా: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని 'స్పేస్‌ఎక్స్ అంతరిక్ష సంస్థ చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. తొలిసారి అంతరిక్షంలో ప్రైవేటు స్పేస్‌వాక్ నిర్వహించేందుకుగానూ 'పోలారిస్ డాన్ ప్రాజెక్టు కింద నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపింది. ఈ మేరకు ఫ్లోరిడాలో కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ దూసుకెళ్లింది. ఈ మొత్తం మిషన్‌కు వ్యాపారవేత్త జేర్డ్ ఇస్సాక్‌మన్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి స్కాట్ కిడ్ దీనికి పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. వారితోపాటు స్పేస్‌ఎక్స్‌కు చెందిన మిషన్ ఇంజినీర్లు సారా గిల్లి, అన్నా మెనోన్ ఉన్నారు. పోలారిస్ మిషన్‌లో తలపెట్టిన మూడు మానవసహిత యాత్రల్లో ఇది మొదటిది.

ఆ రహస్య భేటీపై దర్యాప్తు : సీపీఐ

న్యూఢిల్లీ: ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంతో కేరళ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి భేటీ కావడాన్ని విస్మరించలేమని, ఈ రహస్య సమావేశంపై సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిందేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. కేరళ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) ఎంఆర్ అజిత్ కుమార్ 2023లో ఇద్దరు ఆర్‌ఎస్‌ఎస్ నేతలను రహస్యంగా కలిశారు. ఏడీజీపీకి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు మధ్య ఉద్దేశపూర్వక, రహస్య మంతనాల మర్మమేమిటని సీపీఐ ప్రశ్నించింది. ఇదే విషయమై రాజా దిల్లీలోని విలేకరులతో మాట్లాడుతూ 'ఇది తేలికగా తీసుకునే అంశం కాదు. రహస్యాలను సీపీఎం, కేరళ ప్రభుత్వం విస్మరించలేవు. సమగ్ర

- మిగతా 2 లో

సుప్రీం ఆదేశాలు బేఖాతరు

కొనసాగిన వైద్యుల ఆందోళన

కోల్‌కతా: వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో విధులను బహిష్కరించిన జూనియర్ డాక్టర్లు వెనక్కి తగ్గడం లేదు. తమ డిమాండ్లు సాధించే వరకు విధుల్లో చేరబోమని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు విధించిన 'బ్యాక్ టు వర్క్' డెడ్‌లైన్‌ను ధిక్కరించారు. బెంగాల్ ప్రభుత్వానికి కౌంటర్ డెడ్‌లైన్ విధించారు. సాయంత్రం 5 గంటలలోగా తమ డిమాండ్లు మంజూరు చేయకపోతే ఆరోగ్య సెక్రటేరియట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సాల్ట్ లేక్ వద్ద స్వస్థ భవన్ వరకు వందల మంది వైద్యులు మంగళవారం ఉదయం

- మిగతా 2 లో

భూమివైపు దూసుకొస్తున్న ఆస్టెరాయిడ్

బెంగళూరు: భూగ్రహాన్ని మరో ఆస్టెరాయిడ్ భయపెడుతోంది. ఈ గ్రహశకలం ఏప్రిల్ 13, 2029న భూమికి అత్యంత సమీపం నుంచి ప్రయాణించనుందని ఖగోళ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కాగా ఈ ఆస్టెరాయిడ్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అత్యంత నిశితంగా పరిశీలిస్తోంది. ఇందు కోసం ఇస్రో 'ప్లానెటరీ డిఫెన్స్' అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసింది. భూమివైపు దూసుకొచ్చే ఖగోళ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఉప్పొంగిన ఏలేరు

కాకినాడ జిల్లాలో 86 గ్రామాలను చుట్టుముట్టిన వరద

- వేలాది ఎకరాల్లో పంట నీట మునక
- ప్రత్తిపాడు-సామర్లకోట మధ్య నిలిచిన రాకపోకలు

2లో

ఎగువన కురుస్తున్న వర్షాలతో కాకినాడ జిల్లా ఏలేరు కాల్వకు భారీగా వరద కొనసాగుతోంది. ఏడు గేట్లు ఎత్తేసి ఏలేరు జలాశయం నుంచి సుమారు 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 46వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో జిల్లాలోని పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 10 మండలాల పరిధిలోని 86 గ్రామాలపై పడింది.

ఉగ్ర గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

- ఏజెన్సీ మండలాల్లో ప్రమాద ఘంటికలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు

విశాలాంధ్ర -కుక్కునూరు: మళ్లీ గోదావరికి వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం వద్ద మంగళవారం రెండో ప్రమాద హెచ్చరిక దాటి గోదావరి పరవళ్లు తొక్కుతోంది. గంటగంటకు నీటిమట్టం పెరుగుతోంది. మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో దిగువునున్న ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు ఏజెన్సీ మండలాల్లో మళ్లీ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎగువున ఉన్న ఉప నదుల వరద గోదావరికి చేరడంతో ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. దీంతో నది పరివాహక ప్రాంతాల ప్రజల వెన్నుల్లో వణుకు పుడుతుంది. డొంకరాయి, సీలేరు నుంచి శబరికి వరద భారీగా చేరుకోవడంతో గోదావరి పోటేసింది. ఇప్పటికే వర్షాలు, వరదలతో పనులు లేక... చేతిలో

- మిగతా 2 లో

ఇక...బుడమేరు ప్రక్షాళన

- హైడ్రా తరహా చర్యల కోసం డిమాండ్లు
- దృష్టిపెట్టిన ప్రభుత్వం
- కబ్జాదారుల్లో కలవరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ ప్రభుత్వం కొనసాగిస్తున్న హైడ్రా తరహా చర్యలతో బుడమేరుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణలు తొలగించాలన్న డిమాండ్లు వస్తున్నాయి. హైదరాబాద్‌లో అమలు చేస్తున్న హైడ్రా విధానాన్ని రాష్ట్ర ప్రజలు, రాజకీయ నేతలూ స్వాగతిస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు మీడియా సమావేశంలోనూ బుడమేరు ప్రక్షాళనపై స్పష్టత ఇచ్చారు. ఒక వైపు బుడమేరులోని ఆక్రమణలు తొలగించడంతోపాటు కొల్లేరులోకి సహజ సిద్ధంగా నీటి ప్రవాహం వెళ్లేలా చూస్తామనీ, అక్రమార్కులు ఎవరైనా వదిలిపెట్టేది లేదంటూ వెల్లడించారు. మరోవైపు బుడమేరు పరివాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపునకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చినట్లు పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తాజాగా వెల్లడించారు. ఆపరేషన్ బుడమేరుపై రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయడం అనివార్యంగా మారింది. గతంలో ఎన్నడూ లేనంతగా బుడమేరు ప్రవాహం తన్నుకొచ్చి..దాని పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. ఒకప్పుడు సహజ సిద్ధంగా ఉన్న కొల్లేరు ఆక్రమణకు గురై పెద్దఎత్తున చేపల చెరువుల గట్లు వెలవడంతో, ఆ సమయంలో వరదలొచ్చి కొల్లేరు పరిసర ప్రాంతాలను ముంచెత్తాయి. అప్పట్లో మొత్తం ఆక్రమణలను తొలగించారు. బాంబులతో చేపల చెరువు గట్లను ధ్వంసం చేశారు. ఇప్పుడు హైడ్రా తరహాగా ఆక్రమణలను తొలగించి... బుడమేరు విస్తరణ చేపడితేనే భవిష్యత్‌లో ముంపు ప్రమాదం నుంచి బయటపడే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. బుడమేరులోకి అక్రమంగా

- మిగతా 2 లో

మణిపూర్ ఉద్రిక్తం

- రాజ్‌భవన్ ముట్టడికి విద్యార్థుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు... బాష్పవాయువు ప్రయోగం
- వివిధ జిల్లాల్లో కర్ఫ్యూ విధించిన ప్రభుత్వం

ఇంఫాల్: బీజేపీ ఏలుబడిలోని ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరోమారు భగ్గుమంది. మంగళవారం విద్యార్థులు ఇంఫాల్‌లోని రాజ్‌భవన్‌ను ముట్టడించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పెద్ద ఎత్తున తోపులాట చోటుచేసుకుంది. చివరకు పోలీసులు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

- మిగతా 2 లో

ఉక్కు జోలికొస్తే తొక్క తీస్తాం

- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన మానాలి
- సెయిల్‌లో విలీనం...లేకపోతే మరో సంగ్రామమే
- కార్మిక సంఘాల నేతల హెచ్చరిక
- గాజువాక కూడలిలో రాస్తారోకో ఉద్రిక్తం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎందరో త్యాగధనుల పోరాటాలు, బలిదానాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికాగ్రహం చవిచూడాల్సి వస్తుందని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విడనాడి ఉత్పత్తి సామర్థ్యం పెంచేలా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపుమేరకు మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాల అధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు, ప్రాణాలైనా అర్పిస్తాం, ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకుంటాం, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగసంస్థగానే కొనసాగించాలి, సెయిల్‌లో విలీనం చేసి పూర్తి సామర్థ్యంతో నడపాలి, ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి, కార్మికులారా ఏకం కండి, ఉక్కు జోలికొస్తే ఖబడ్దార్ అంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. గాజువాకలో స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. వామపక్ష పార్టీల నాయకులు, కాంగ్రెస్, తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాత గాజువాక కూడలికి చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్థంభించింది. రోడ్డుకిరువైపులా కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఆందోళన చేస్తున్న నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆందోళనకారులు ప్రతిఘటించడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం అరెస్ట్ చేసిన నేతలను గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కేఎస్‌ఎన్ రావు, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణతో పాటు ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు

- మిగతా 2 లో

చేదు జ్ఞాపకాలు

విషాదాన్ని మిగిల్చిన వరద

విశాలాంధ్ర-డిజిటల్: ఉరుములా, మెరుపులా, ఎగిసిపడిన సముద్రపు కెరటాల వలే... కన్నుమూసి తెరిచేలోగా మేనువులా విరుచుకుపడిన వరద అలలకు వేలాది కుటుంబాలు ఉక్కిరిబిక్కిరయ్యాయి. తేరుకునేలోపే ఇళ్లను వరదనీరు ముంచెత్తింది. చెట్టుకొకరు పుట్టకొకరు చెల్లాచెదురయ్యారు. ప్రాణాలు రక్షించుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు వెళ్తూ ఒక్క విజయవాడ నగర, రూరల్ పరిధిలో సుమారు 40 మంది అసువులుబాశారు. భారీ వర్షాలు, వరదలకు రాష్ట్ర వ్యాప్తంగా 55 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అంచనా. లెక్కకందని మరెందరో జాడ తెలియలేదు. అంతుచిక్కని వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 2.76 లక్షల మంది వరదబారిన పడినట్టు అంచనా. 46,320 నిర్వాసితులకు 226 పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,44,536 మంది నష్టపోయారని ప్రభుత్వ అంచనా. వరద ఉగ్రరూపాన్ని అడ్డుకుని ఆదుకునే దిక్కులేక కొందరు ఇళ్లల్లోనే తనువు చాలించారు. పదుల సంఖ్యలో మృతదేహాలు వరదలో కొట్టుకురావడం, ఇళ్ల గోడలపై వేలాడుతున్న దృశ్యాలు భయకంపితులను

- మిగతా 2 లో

రాజధాని పనుల్లో కదలిక

- రూ.930 కోట్ల వ్యయంతో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు
- జీ ప్లస్ 18తో 12 టవర్లుగా నిర్మాణం
- త్వరలో టెండర్లు పిలవనున్న సీఆర్‌డీఏ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత ప్రభుత్వ హయాంలో దాదాపు ఐదు సంవత్సరాల పాటు నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయిన అమరావతి రాజధానిలో మళ్లీ కదలిక ప్రారంభమైంది. ఇప్పటికే కంపచెట్లు పూర్తిస్థాయిలో తొలగించి శుభ్రం చేసిన సీఆర్‌డీఏ... తాజాగా హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుపై దృష్టిపెట్టింది. 2014-19

- మిగతా 2 లో

మణిపూర్ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం అనేక జిల్లాల్లో కర్ఫ్యూ విధించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. శాంతి భద్రతల రీత్యా తూర్పు, పశ్చిమ ఇంఫాల్‌ల జిల్లాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి కర్ఫ్యూ విధిస్తున్నట్లు జిల్లా యంత్రాగం ప్రకటించింది. ఇక కర్ఫ్యూ నేపథ్యంలో ప్రజలకు హెచ్చరికలు జారీ అయ్యాయి. కర్ఫ్యూకు సంబంధించి కొత్త ఉత్తర్వులు జారీ చేసే వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో అత్యవసర సేవలకు, మీడియాకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. మణిపూర్ లో ఇటీవల జరుగుతున్న డ్రోన్ దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. కేవలం 10 రోజుల వ్యవధిలోనే జాతుల హింసలో 11 మంది మృతిచెందారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. సోమవారం కూడా అనేక ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. వందల సంఖ్యలో స్కూల్, కాలేజీ విద్యార్థులు రాజ్ భవన్ వైపు ర్యాలీ తీశారు. రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతేడాది నుంచి కొనసాగుతున్న హింస పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు, గవర్నర్ రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అంతేగాక నైతిక కారణాలతో 50 మంది ఎమ్మెల్యేలు సైతం రాజీనామా చేయాలని తెలిపారు. హింసాత్మక పరిస్థితులను నియంత్రించడంలో విఫలమైన పారామిలటరీ బలగాలను ఉపసంహరించుకోవాలని సూచించారు.డ్రోన్ దాడులను అరికట్టడంలో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం, పోలీసులు విఫలమయ్యారని మండిపడ్డారు.

ఏదాది నుంచి ఘర్షణలు

ఇదిలా ఉండగా.. ఏడాదికి పైగా కొనసాగుతున్న మణిపూర్ తెగల మధ్య ఘర్షణలు ఇంక తగ్గడం లేదు. కొండ ప్రాంతాల్లో నివసించే కుకీలు, మైదాన ప్రాంతాల్లో నివసించే మెయితీల మధ్య నెలకొన్న వైరం గత ఏడాది మే నెలలో ప్రత్యక్ష ఘర్షణలకు, దాడులకు దారితీసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచీ వివిధ స్థాయిల్లో ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. బీరెన్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మెయితీల పక్షం వహిస్తూ కుకీల అణచివేతకు తోడ్పడుతున్నదనే ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు మణిపూర్ ఘర్షణల్లో 220 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఇరు వర్గాల వారు ఉన్నప్పటికీ కుకీలే అధికంగా ఉన్నట్టు సమాచారం. మహిళలపై కనీవినీ ఎరుగని రీతిలో అమానుషమైన దాడులు జరగడం మణిపూర్‌కు మచ్చ తెచ్చింది. మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపేందుకు కేంద్రం జోక్యం చేసుకోకపోగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు మణిపూర్ గురించి, అక్కడి మహిళలపై జరుగుతున్న ఘోరాల గురించి మాట్లాడకపోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో పౌర ప్రభుత్వ పాలన పట్టు తగ్గిపోయి మిలిటెంట్ గ్రూపుల హవా పెరిగింది.

రాజధాని పనుల్లో కదలిక

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని పరిధిలో నివాస సముదాయాల ప్రాజెక్టు నిర్మాణానికి సీఆర్‌డీఏ ఆన్‌లైన్ బుకింగ్ నిర్వహించగా... కేవలం గంట వ్యవధిలోనే 1200 ఫ్లాట్లు బుక్ అయ్యాయి. ఆ సమయానికి భారత్‌తో పాటు వివిధ దేశాల్లో నివసించే తెలుగువారు దాదాపు 18 వేల మంది హ్యాపీనెస్ట్‌లో ఫ్లాట్ల కొనుగోలు కోసం ఆన్‌లైన్‌లో ఉండటం విశేషం. అటువంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిపివేసింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులనే నిలిపివేయడంతో 25 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించిన ఆ యజమానులు మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏ తాజాగా రాజధాని పరిధిలో రూ.930 కోట్లతో హ్యాపీనెస్ట్ నివాస సముదాయాల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టేందుకు అనుమతి మంజూరు చేసింది. జీ ప్లస్ 18 ప్రాతిపదికన ఆకర్షణీయమైన 12 టవర్లుగా నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 1200 ఫ్లాట్లు నిర్మించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ప్రాజెక్టుపై పడే రూ.216.61 కోట్ల అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి ఇచ్చేందుకు గతంలో సీఎం అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే సమావేశంలో ఆమోదం తెలియజేసింది. గత ప్రభుత్వ హయాంలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులు చేపట్టకపోవడంతో రూ.216 కోట్లకుపైగా అదనపు భారం పడనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు వీలుగా టెండర్లను సీఆర్డీయే జ్యుడీషియల్ ప్రివ్యూకి పంపించింది. ఈ మేరకు ప్రాజెక్టు నిర్మాణపనులు త్వరలో ప్రారంభించేందుకుగాను సీఆర్డీయే టెండర్లు పిలవనుంది.

ఆ రహస్య భేటీపై దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తుతోనే వాస్తవాలు వెలుగుచూస్తాయి. ఈ గోప్య సమావేశాలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమావేశాలను ఎవరు నిర్వహించారు, వీటి ఉద్దేశమేమిటి, ఏమేమి అంశాలు చర్చించారు వంటివి తెలియాల్సి ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వాన్ని పోలీసులు ఉన్నతాధికారి కలవడమన్నది చిన్న విషయం కాదు. ముఖ్యమంత్రి నుంచి ముందస్తు అనుమతిని పొందారో లేదో కూడా తెలియదు. ఎల్డీఎఫ్ ప్రభుత్వంతో దీనిపై వివరణ కోరమని సీపీఐ కేరళ నాయకత్వానికి ఆదేశాలిచ్చా. ఈ వ్యవహారం రాజకీయంగానే కాకుండా సామాజికంగా కేరళ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది సీపీఐ అధ్యయనం చేస్తుంది' అని రాజా అన్నారు.

దర్యాప్తునకు ఎల్డీఎఫ్ మద్దతు

ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వాన్ని కలిసినట్లు ఏడీజీపీ అంగీకరించారని ఎల్డీఎఫ్ కన్వీనర్ టీపీ రామకృష్ణన్ తెలిపారు. దీనిపై ప్రభుత్వ దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. అన్ని వివరాలు త్వరలోనే వెల్లడవుతాయని అన్నారు. ఎల్డీఎఫ్ విధానానికి విరుద్ధంగా... అధికార పరిధిని అతిక్రమించినట్లు తేలితేగనుక ఆ అధికారి పదవిని కోల్పోతారని, ఆయనకు శిక్ష కూడా తప్పదని రామకృష్ణన్ అన్నారు.

సుప్రీం ఆదేశాలు బేఖాతరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రదర్శనగా వెళ్లారు. సాయంత్రం 5 గంటల తర్వాత ధర్నా చేశారు. డిమాండ్లు నెరవేర్చే వరకు కదిలేది లేదని భీష్మించారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్, రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రాజీనామాను వైద్యులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమన్నారు.

51 మంది వైద్యులకు నోటీసులు

51 మంది వైద్యులకు ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రి యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. బుధవారం విచారణ కమిటీ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. తమ తప్పు లేదని నిరూపించుకోవాలని సూచించింది. నిరసన తెలుపుతున్న వైద్యులను దుయ్యబట్టింది. బెదిరింపు సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని, పని వాతావరణాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని నోటీసుల్లో పేర్కొంది. 51 మంది వైద్యులను విచారణ కమిటీ పిలిచే వరకు ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిషేధించాలని ఆసుపత్రి కమిటీ నిర్ణయం తీసుకుంది. సంబంధిత నోటీసులపై ఆసుపత్రి ప్రిన్సిపల్ సంతకాలు చేశారు. నిషేధిత జాబితాలో సీనియర్ రెసిడెంట్స్, హౌస్ స్టాఫ్, ఇంటర్న్స్, ప్రొఫెసర్లు ఉన్నారు. ఇదిలావుంటే వైద్యుల సమ్మె వల్ల 23 మంది చనిపోయారన్న కేసు ఈనెల 17న కోర్టు విచారించనున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను వైద్యులు తోసిపుచ్చారు. 93వేల మంది రిజిస్టర్డ్ వైద్యులు రాష్ట్రంలో ఉంటే తమ సంఖ్య 7,500 మాత్రమేనని చెప్పారు. ఈ లెక్కన తాము అందుబాటులో లేక వైద్య సేవలు కుంటుపడినట్లు రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న ఆరోపణలలో నిజం లేదని స్పష్టమవుతోందని వైద్యులు వెల్లడించారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడి

40 మంది మృతి
60 మందికి గాయాలు

దెయిర్ అల్ బలాహ్: గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ తీవ్రస్థాయిలో కొనసాగిస్తోంది. పలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న రక్షిత ప్రాంతంలోని శిబిరంపై మంగళవారం దాడి చేసింది. ఈ ఘటనలో 40 మంది చనిపోగా 60 మందికిగాపై గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని పలస్తీనా అధికారులు వెల్లడించారు. హమాస్ తీవ్రవాదులను తుడిచిపెట్టే నెపంతో రక్షిత ప్రాంతాలలోనూ ఇజ్రాయిల్ దాడులు చేస్తోంది. మవాసీ (శిబిరం)లో 40 మృతదేహాలు లభ్యమైనట్లు పౌరరక్షణ వర్గాలు తెలిపాయి. గుడారాల్లో తలదాచుకునే చాలా కుటుంబాలు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించాయి. ఘటనా స్థలిలో మూడు పెద్ద అగాధాలు ఏర్పడినట్లు అసోసియేటెడ్ ప్రెస్ కెమెరామెన్ పేర్కొన్నారు. ఇసుక, రాళ్లురప్పల గుండా శరణార్థులను తరలిస్తున్నట్లు వెల్లడించారు. పొద్దుపోయిన తర్వాత ఈ దాడి జరగడంతో సెల్‌ఫోన్ల వెలుగులో తరలింపు కొనసాగిందన్నారు. ఖాన్ యూనియన్‌లోని నసీర్ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. 20కుపైగా మృతదేహాలను తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని అక్కడి సిబ్బంది తెలిపారు.

దాడి చేసింది హమాస్ కేంద్రంపైనే: ఇజ్రాయిల్

కమాండ్ - కంట్రోల్ కేంద్రం నడుపుతున్న హమాస్ తీవ్రవాదులే లక్ష్యంగా దాడి చేశామంటూ ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. పౌర మరణాలు నివారించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, ఏరియల్ సర్వే చేశామని సమర్థించుకుంది. 11 నెలలుగా సాగుతున్న ఈ పోరులో సామాన్యులకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు తాము అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరణ ఇచ్చుకుంది. నిర్వాసిత ప్రాంతాల్లో నక్కి ఉంటున్న హమాస్ కారణంగా పౌర మరణాలు సంభవిస్తున్నాయని, ఇందుకు ఉగ్ర సంస్థదే బాధ్యతని పేర్కొంది.

మా వాళ్లు అక్కడ లేరు: హమాస్

ఇజ్రాయిల్ ఆరోపణలను హమాస్ తోసిపుచ్చింది. దాడి జరిగిన ప్రాంతంలో తమ వారు లేరని స్పష్టంచేసింది. ఇజ్రాయిల్ తమపై నెపం నెడుతోందని పేర్కొంది.

మృతులు 40వేలకు పైమాటే: గాజా ఆరోగ్యశాఖ

ఇజ్రాయిల్ దురాక్రమణలో ఇప్పటివరకు 40వేల మందికిపైగా పలస్తీనియన్లు చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ ఒక ప్రకటన వెలువరించింది. గాజా జనాభా మొత్తం 2.3 మిలియన్లు కాగా ఇందులో 90 శాతం మంది అక్కడ నుంచి తరలిపోయారు. వేలాది మంది మావసీలో తలదాచుకుంటున్నారు. మవాసీ అంటే తీరం వెంబడి ఏర్పాటు చేసిన క్యాంపులు. శిబిరాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు సహాయక సంఘాలు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. మానవతా జోన్లుగా ప్రకటించిన ప్రాంతాలపైనా ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతుండటంతో పరిస్థితి మరింత జఠిలమవుతోంది.

రష్యా-చైనా నావికా విన్యాసాలు

మాస్కో: రష్యా, చైనా యుద్ధ నౌకలు సంయుక్తంగా నావికా విన్యాసాల్లో పాల్గొన్నాయి. రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం మధ్యధరా నుంచి పసిఫిక్ వరకు ఈ విన్యాసాలు జరిగాయి. చైనాకు చెందిన నాలుగు యుద్ధ నౌకలు, ఒక సరఫరా నౌకతో పాటు రష్యా నౌకలు దక్షిణ వ్లాదివోస్టోక్‌లోని పీటర్ ది గేట్ బేలో ప్రదర్శించాయని రష్యా రక్షణశాఖ వెల్లడించింది. మారిటైమ్ ఆర్థిక కార్యకలాపాల క్షేత్రాలు, సముద్ర సంప్రదింపుల రక్షణకు సంబంధించి విన్యాసాలు జరిగాయని తెలిపింది. సెప్టెంబరు 16 వరకు పసిఫిక్, ఆర్టిక్ మహాసముద్రాలు, మధ్యధరా, బాల్టిక్, కాస్పియన్ సముద్రాల్లో జరిగే విన్యాసాలలో భాగంగానే తాజా ప్రదర్శన జరిగిందని పేర్కొంది. మొత్తం విన్యాసాల్లో 400కుపైగా రష్యా యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, సపోర్ట్ వెజల్స్ పాల్గొంటాయని వెల్లడించింది. ఇదిలావుంటే, తమ రెండు దేశాల మధ్య సైనిక సహకారాన్ని, భద్రతా సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకునే ఉద్దేశంతో మరింత పెంచుకోవడమే ఈ విన్యాసాల లక్ష్యమని చైనా అధికారిక వార్తాసంస్థ జిన్హువా వెల్లడించింది.

13ఏళ్ల తర్వాత 'ఫుకుషిమా' ప్రక్షాళన

టోక్యో: జపాన్‌లోని ఫుకుషిమా రియాక్టర్ ప్రక్షాళన ఎట్టకేలకు ప్రారంభమైంది. సునామీ సంభవించిన 13 ఏళ్ల తర్వాత రియాక్టర్ నుంచి అణు వ్యర్థాల తొలగింపు ప్రక్రియ మంగళవారం మొదలైంది. 880 టన్నుల అత్యంత ప్రమాదకరమైన రేడియోధార్మిక చెత్త పేరుకుపోగా... క్లిష్టమైన ఆపరేషన్ ద్వారా రెండు వారాల్లో దానిని తొలగిస్తామని టోక్యో ఎలక్ట్రిక్ పవన్ కంపెనీ (టెప్కో) ఒక ప్రకటన వెలువరించింది. పైలట్ ఎక్స్‌ట్రాక్షన్ ఆపరేషన్ పేరిట ఈ కార్యానికి నడుం బిగించింది. సాంకేతిక సమస్యలతో ఈ పని గతంలో పెండింగ్ పడింది. రియాక్టర్ల పరిస్థితిని అంచనా వేసేందుకు రేడియో ధార్మిక పదార్థాల నమూనాను అధ్యయనం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఉప్పొంగిన 'ఏలేరు'

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: ఎగువన కురుస్తున్న వర్షాలతో కాకినాడ జిల్లా ఏలేరు కాల్వకు భారీగా వరద కొనసాగుతోంది. ఏడు గేట్లు ఎత్తేసి ఏలేరు జలాశయం నుంచి సుమారు 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 46వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో జిల్లాలోని పిఠాపురం, జగ్గంపేట, పత్తిపాడు నియోజకవర్గాల్లోని 10 మండలాల పరిధిలోని 86 గ్రామాలపై పడింది. ఇప్పటికే ఆయా గ్రామాలు, కాలనీలను వరద చుట్టుముట్టింది. ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నీటమునిగింది. కిర్లంపూడి మండలం రాజుపాలెం, ఎస్ తిమ్మాపురం, గోపాలపట్నం, సుందరాయనపాలెం గ్రామాలు ఏలేరు వరద ముంపులో ఉన్నాయి. ఎస్ తిమ్మాపురం, రాజుపాలెం గ్రామాల వద్ద ఏలేరు కాల్వకు గండి పడడటంతో భారీగా వరద గ్రామాలను ముంచెత్తింది. దీంతో ఇళ్లు, పంట పొలాల్లోకి వరద చేరింది. దీంతో గ్రామాల నుంచి బయటకు వచ్చే మార్గంలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఆహారం, నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ట్రాక్టర్‌పై పర్యటించి బాధితులతో మాట్లాడారు. రాజుపాలెంలో 2.కి.మీ మేర రహదారిపై వరద ప్రవహిస్తోంది. ప్రత్తిపాడు-సామర్లకోట మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గోపాలపట్నం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోనూ వరద ప్రభావం ఎక్కువగా ఉంది. అధికారులు 35 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 500 మందిని అక్కడికి తరలించారు. మరోవైపు ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు దిగనున్నాయి. ఏలేరు వరద ప్రభావిత గ్రామాల్లో స్కూళ్లకు అధికారులు ఇవాళ సెలవు ప్రకటించారు. వరద నీటి ఉధృతికి పిఠాపురం నియోజవర్గంలో ఐదు చోట్ల కాలువలు గండ్లు పడి గ్రామాలను సైతం ముంచెత్తాయి. గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై భారీగా నీరు ప్రవహించడంతో వాహనాలు దారి మళ్లించారు. పత్తిపాడు నియోజకవర్గంలో ఏలేశ్వరం మండలం పూర్తిగా వరద ముంపుకు గురైంది. కాగా సమీప జగ్గంపేట నియోజకవర్గంలో గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట మండలాలను సైతం వరద ముంచేతత్వంతో కిర్లంపూడి మండలంలో రాజుపాలెం వద్ద కాలువకు గండి పడి వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. ఏలేశ్వరంలో అప్పన్నపాలెం బ్రిడ్జి మునిగిపోవడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దాపురంలో వరదలకు లో బ్రిడ్జి మొత్తం కొట్టుకుపోయింది. సోమవారం రాత్రి వరకు వరద ఉధృతి కొనసాగినప్పటికీ మంగళవారం నిలకడగా కొనసాగుతోంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో పర్యటించి బాధితుల నుండి వివరాలు తెలుసుకున్నారు.

అన్ని రకాల అండగా ఉంటామని హామీ ఇచ్చి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. మంగళవారం పత్తిపాడు శాసనసభ్యురాలు సత్యప్రభ, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ తమ తమ నియోజకవర్గాల్లో ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. కాగా వరద ఉధృతి తగ్గిన అనంతరం పంట నష్టం అంచనా వేయడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం సకాలంలో పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉగ్ర గోదావరి

(మొదటిపేజీ తరువాయి)

చిల్లిగవ్వ లేక ప్రజలు బతుకు బండి నెట్టుకొస్తున్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు, చాలా ప్రాజెక్టుల నుంచి వరద విడుదల కానున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద 55 అడుగులకు చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముందస్తు సూచనలు చేస్తున్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతాల ప్రజలతో అధికారులు అనుక్షణం మాట్లాడుతూ వరదలపై అలెర్ట్ చేస్తున్నారు. కుక్కునూరు ఎమ్మార్వో చలపతిరావు, ఎస్.ఐ. రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

ఇక...బుడమేరు ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించిన భవనాలు, నిర్మాణాలను కూల్చివేస్తేనే భవిష్యత్‌లో ముంపు సమస్య తొలగిపోనుంది. ఎట్టకేలకు దీనిని గుర్తించిన ప్రభుత్వం కొల్లేరు ప్రక్షాళనే లక్ష్యంగా ముందుకుపోతోంది. వరదలతో బుడమేరు పరివాహక ప్రాంత ప్రజలు ప్రాణ, ఆస్తి నష్టాలకు గురయ్యారు. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 45మందికిపైగా చనిపోతే...అందులో ఒక్క విజయవాడలోనే 25 మంది ఉండటం గమనార్హం. విజయవాడ సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో 2.70లక్షల మంది ప్రజలు బుడమేరు ప్రభావంతో నిరాశ్రయిలయ్యారు. పది రోజులపాటు జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. మైలవరం నియోజకవర్గం నుంచి ప్రారంభమైన బుడమేరుకు వెలగలేరు దగ్గర రెగ్యులేటర్ ఏర్పాటు చేశారు. బుడమేరు పరివాహక ప్రాంతం 162 కిలోమీటర్ల పొడవుతో విస్తరించి ఉంది. ఇటీవల పడిన భారీ వర్షాలు, వరదలకు బుడమేరులో 40వేల క్యూసెక్కులకు పైగా నీరు వచ్చినట్లు సమాచారం. దీంతోనే బుడమేరు గట్లు తెగిపోయి...విజయవాడ నగరంపై తీవ్ర ప్రభావం చూపింది. జక్కంపూడి కాలనీ నుంచి అంబాపురం, సింగ్‌నగర్, కృష్ణాహోటల్ సెంటర్, వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, పాయకాపురం, ప్రశాంతినగర్, సుందరయ్యనగర్, కండ్రిక, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలన్నీ పది రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ వరద నీటిని తరలించే అవకాశం లేకపోవడంతో అధికార యంత్రాంగం అష్టకష్టాలుపడాల్సి వచ్చింది. చివరకు బుడమేరు ప్రక్షాళనే సరైనదన్న నిర్ణయానికి ప్రభుత్వమూ వచ్చింది. దీంతో ఆక్రమణ దారుల్లో ఆందోళన మొదలైంది. చాలా మంది బుడమేరు పరివాహకంలో భారీ భవంతులు కట్టుకుని ఏళ్లతరబడి జీవిస్తున్నారు. బుడమేరు ప్రక్షాళన మొదలైతే...ఆక్రమణలో ఉన్న నిర్మాణాలన్నీ కూల్చివేయక తప్పని పరిస్థితి ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వారికి నష్టపరిహారం కల్పించిగానీ, లేక ప్రత్యామ్నాయ చర్యలు చూపి...బుడమేరు ప్రక్షాళనకు ముందుకెళ్లాల్సిన అవసరముంది. కృష్ణలంక దగ్గర కృష్ణానది చుట్టూ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించిన సమయంలో అడ్డంకిగా ఉన్న ఆక్రమిత ఇళ్లను తొలగించడం జరిగింది. ఇదే తరహాగా బుడమేరు ప్రక్షాళనపై ముందుకెళ్లాల్సిన అవసరముంది.

రాజకీయ నేతల అండదండలతోనే...

సహజ సిద్ధంగా ప్రవహించే బుడమేరు చుట్టూ కొందరు రాజకీయ నేతల అండదండలతోనే ఆక్రమణలు వెలిశాయి. ఆయా ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పుడు..స్థానిక అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెంచి ఆక్రమణలకు తెరదీశారు. ఏ ప్రభుత్వాలు వచ్చినప్పటికీ, బుడమేరు ముంపునకు గురైనప్పుడే సమీక్షలతో హడావుడి చేసి... ఆ తర్వాత మౌనంగా ఉండటం పరిపాటైంది. విజయవాడకు మరో సారి వరద కష్టం రాకుండా బుడమేరు ప్రక్షాళనకు ప్రభుత్వం సన్నద్ధమవ్వాల్సి ఉంది. పార్టీల జోక్యం లేకుండా ఎక్కడికక్కడే ఆక్రమణలు తొలగించి సహజ సిద్ధంగా కొల్లేరులోకి బుడమేరు నీరెళ్లేలా చూడాలి.

లేకుంటే ఆక్రమణలు వల్ల బుడమేరు నీరు వెనక్కి తన్నే ప్రమాదముంది. బుడమేరు ప్రవాహం ప్రారంభమైన వెలగలేరు నుంచి విజయవాడ నగరం, గన్నవరం చివరి వరకూ ఎత్తయిన రిటైనింగ్‌వాల్‌ను పటిష్టంగా నిర్మించాలి. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. బుడమేరు ముంపుతో దెబ్బతిన్న రహదారులు, డ్రెయిన్లు, కాల్వ గట్ల మరమత్తులు చేయాలి. ఒక్క బుడమేరు ప్రక్షాళనే కాకుండా విజయవాడ నగర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణకు దిగాల్సిన సమయం ఆసన్నమైంది.

ఉక్కు జోలికొస్తే తొక్క తీస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కసిరెడ్డి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె. వనజాక్షి , పిల్లా పద్మ , సీపీఎం నాయకులు కేఎం శ్రీనివాస్, రాంబాబు, లోకేశ్, బంగారు నాయుడు, సంతోశ్ తదితరులు ఉన్నారు.

పదవి, ప్రాణ త్యాగాల ద్వారా ఆంధ్రులు సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు మరోమారు త్యాగపూరిత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్, సీఐటీయూ తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం(సీపీఐ) జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, రైతు సంఘం(సీపీఎం) జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఏపీఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

విశాఖస్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం అందరం కలిసికట్టుగా పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్ అన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ప్రైవేటీకరణను ఆపాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించాలని మచిలీపట్నం స్థానిక రేవతి సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. పట్టణ కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణరావు, ఆర్టీసీ కార్గో యూనియన్ నాయకులు జి దుర్గారావు, తురక లక్ష్మయ్య, సీఐటీయూ నేత బోరా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వక్తులకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు కోరారు. కేంద్ర కార్మికశాఖ, రైతుసంఘాల పిలుపు మేరకు ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన రాజ్‌విహార్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. జిల్లాలో కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయంలో రాస్తారోకో నిర్వహించారు.

విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని ఏలూరు పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్ వీడి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ద వెంకటరావు తదితరులు ప్రసంగించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపడానికి సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన రాస్తారోకోలో నేతలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, కె.రాధాకృష్ణ , సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, హేమలత, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు తదితరులు ప్రసంగించారు.

మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు స్వస్తి పలకాలని కడప ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన ధర్నాలో నేతలు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, బి.మనోహర్, రైతు సంఘం (సీపీఐ) జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, రైతు సంఘం(సీపీఎం) జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి తదితరులు ప్రసంగించారు.

భూమివైపు దూసుకొస్తున్న ఆస్టెరాయిడ్

(మొదటిపేజీ తరువాయి)

వస్తువుల నుంచి భూమిని రక్షించడమే ఈ విభాగం కర్తవ్యం. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఈ విషయాన్ని ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. భారత్‌కు చెందిన భూస్థిర ఉపగ్రహాలు పరిభ్రమిస్తున్న కక్ష్యల కంటే దగ్గరగా భూమికి సమీపం నుంచి అపోఫిస్ గ్రహశకలం ప్రయాణిస్తుందని అంచనా వేస్తున్నట్టు సోమనాథ్ వెల్లడించారు. భూమికి 32 వేల కిలో మీటర్ల ఎత్తులో ప్రయాణించవచ్చునని వివరించారు. ఇంత పెద్ద పరిమాణం ఉన్న మరే ఇతర గ్రహశకలం భూమికి ఇంత దగ్గర నుంచి ప్రయాణించలేదని ఆయన చెప్పారు. గ్రహశకలం అపోఫిస్ పరిమాణం ఎంత పెద్దగా ఉందో సోమనాథ్ వెల్లడించారు. భారత్‌కు చెందిన అతిపెద్ద విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య, దేశంలో అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా ఉన్న నరేంద్ర మోదీ స్టేడియం కంటే పెద్దదని తెలిపారు. గ్రహశకలం సుమారు 340 నుంచి 450 మీటర్ల వ్యాసం ఉందన్నారు. 140 మీటర్ల వ్యాసం కంటే పెద్దదైన గ్రహశకలం ఏదీ ఇప్పటివరకు భూమికి దగ్గరగా రాలేదని ఆయన అన్నారు. 'ఒక భారీ గ్రహశకలం మానవాళి అస్తిత్వానికి నిజమైన ముప్పు. ఇలాంటి ముప్పుల విషయంలో ఇస్రో అప్రమత్తంగా ఉంది. మా 'నెట్‌వర్క్ ఫర్ స్పేస్ ఆబ్జెక్ట్స్ ట్రాకింగ్ అండ్ అనాలిసిస్' గ్రహశకలం 'అపోఫిస్'ను చాలా దగ్గరగా పర్యవేక్షిస్తోంది. మనం జీవించడానికి ఒకటే భూమి ఉంది. అందుకే భవిష్యత్‌లో భూమికి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే విషయంలో భారత్ అన్ని దేశాలతో కలిసి పని చేస్తుంది.

చేదు జ్ఞాపకాలు

(మొదటిపేజీ తరువాయి)

చేశాయి. ఎందరో మృతకళేబరాలను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తమవారి జాడ దొరుకుతుందేమోనన్న ఆశతో కుటుంబ సభ్యులు వెదుకులాట ప్రారంభించారు. కుళ్లిన మృతదేహాలను చూస్తూ కన్నీరుమున్నీర య్యారు. 22 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్టు విశ్వసనీయ సమాచారం. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర జిల్లాల్లో లక్షలాది మంది భారీ వర్షాలు, వరదల బారినపడినట్టు వార్తాకథనాలు. 20 జిల్లాల్లో 2,05,194 మంది రైతులు నష్టపోయారు. 12 జిల్లాల్లో 19,686 హెక్టార్లలో ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి.ఎన్టీఆర్ జిల్లాలో బుడమేరు పెనుముప్పు విషాదాన్ని మిగిల్చింది. విజయ వాడ నగరంలోని సింగ్‌నగర్, వాంబేకాలనీ, శాంతినగర్, ఇందిరానాయక్‌నగర్, పసుపుతోట, ఆంధ్రప్రభ కాలనీ, కండ్రిక, రాజీవ్‌నగర్, ప్రకాశ్‌నగర్, ఎల్బీనగర్, భవానిపురం, విద్యాధరపురం, రూరల్ మండలం అంబాపురంలో వేలాది కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. ముంచుకొచ్చిన ముప్పుతో ముప్పుతిప్పలు పడ్డారు. పసిబిడ్డలు పాలులేక అల్లాడిపోయారు. లక్షకు పైగా ద్విచక్రవాహనాలు, 30 వేల కార్లు, ఐదువేల ఆటోలు... వరదకు దెబ్బతిన్నాయి. ఇళ్లల్లో రూ.లక్షలాది విలువచేసే ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయి. వేలాది ఇళ్లల్లో అరచేతి మందాన ఎర్రటి బురద పేరుకుపోయింది. ఊహతెలిసి ఇంతటి ఉపద్రవాన్ని చూడలేదన్నారు. విద్యుత్‌లేక వారం రోజుల పాటు అమావాశ్య చీకట్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. తాగునీరు లేక, కాలే కడుపుతో, పిల్లల రోదనలతో తొలి మూడురోజులూ నరకయాతన అనుభవించారు. 60 ఏళ్ల తర్వాత పది రోజుల పాటు అలజడి సృష్టించిన వరద చేదు జ్ఞాపకాలను మిగిల్చింది.

నిజాంపై దాశరథి అక్షర శస్త్రాలు

శతజయంతి సభలో
పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-విశాఖ: సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి... నిజాం నిరంకుశ పాలనపై సాహితీ ఉద్యమం చేసిన గొప్పకవి దాశరథి కృష్ణమాచార్య అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో విశాఖ ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లోని టీఎల్ఎన్ సభా హాలులో కళా ప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పెనుగొండ లక్ష్మీనారాయణ కీలక ఉపన్యాసం చేస్తూ... నిజాం నిరంకుశ పాలనలో ప్రజల కడగండ్లు చూసి చలించి... నిజాంపై అక్షర శస్త్రాలు సంధించారని, సాహితీ పోరాటంతో పాటు సాయుధ పోరాటం చేసిన ఇద్దరు కవులలో దాశరథి కృష్ణమాచార్య, శివసాగర్ ఉన్నారని తెలిపారు. నిజాం ప్రభుత్వం ఆయనను జైలులో పెట్టినప్పుడు పళ్లు తోముకోవడానికి ఇచ్చిన బొగ్గుతో గోడలపై నిజాంకి వ్యతిరేకంగా కవితలు రాశారని, నిజాం పోలీసులు రోజూ వచ్చి ఆయన రాసిన కవితల్ని చెరిపేసి...కర్రలతో కొట్టేవారని, దీంతో ఆయన కుడిభుజం విరిగిందన్నారు. ఆయన సాహిత్యంలో తెలంగాణ రైతాంగ పోరాటం, జాతీయవాదం, అభ్యుదయ కవిత్వం, భావ కవిత్వం కనిపిస్తాయని చెప్పారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1920 దశకంలో పుట్టిన మహాకవుల్లో దాశరథి కృష్ణమాచార్య ఒకరని, ఆయన గురించి రేపటి తరం తెలుసుకోవాలని, సాహితీవేత్తల శతజయంతి ఉత్సవాలు... వారి గురించి తెలిసిన వారి మధ్య కాకుండా తెలియని వారి మధ్య జరగాలని అభిప్రాయపడ్డారు. భాషకు హద్దులు లేవని, జాషువా విశ్వనరుడు ప్రస్తావన తెస్తూ కొందరు తెలంగాణ కవులు విభజనవాదం తేవడం సమంజసం కాదని అన్నారు.

విశాలాంధ్ర జాతీయ దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై నిజాంకు వ్యతిరేకంగా దాశరథి కృష్ణమాచార్య పోరాటం చేశారని గుర్తుచేశారు. నిజాం సంస్థానంలో 80 శాతం మంది ప్రజలు తెలుగు మాట్లాడేవారు ఉండగా... ఉర్దూ అధికార భాషగా ఉండేదని, తెలుగు మాట్లాడటం, రాయడం, చదవడం చేయకూడదని ఆంక్షలు ఉండేవన్నారు. ఉర్దూ పాఠశాలలతోపాటు అక్కడక్కడ ఆంగ్ల మాధ్యమంతో పాఠశాలలు నడిచేవని, వైద్య విద్య బోధన కూడా ఉర్దూలోనే సాగేదని, అయితే తెలుగుపై నిషేధం గ్రామాల్లో సాధ్యం కాలేదని చెప్పారు. స్వాతంత్ర్యం తరువాత నిజాం సంస్థానంపై పోలీసు చర్య జరిగే నాటికే రైతాంగ సాయుధ పోరాటం వల్ల నిజాం పూర్తిగా నిస్సహాయుడిగా మారాడని అన్నారు. నిజాం వ్యతిరేక పోరాటానికి కోస్తా ఆంధ్ర ప్రజలు ఎంతో సాయం చేశారని చెప్పారు. కోస్తా ఆంధ్రలో 1943కే అరసం ఏర్పడగా చాలాకాలం తరువాత తెలంగాణలో అరసం ఏర్పడిందని చెప్పారు. అంతకుముందు తెలంగాణ రచయితల సంఘం ఉండేదని, దానికి దాశరథి అధ్యక్షుడిగా ఉండేవారని తెలిపారు. దాశరథి అత్యంత నిరాడంబర జీవితం గడిపారని చెప్పారు. దాశరథి ఉత్తరాలు ఎక్కువగా రాసేవారని, సాధారణంగా కనిపించే దాశరథిలో విప్లవాగ్ని ఉండేదని అన్నారు. హైదరాబాద్ సిటీ కాలేజీ ఆచార్యులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక జీవితం ప్రతిబింబించిన సాహిత్యం ప్రజల నాలుకల్లో నిలుస్తుందని, ప్రాచీన సాహిత్యంలో కూడా సామాజిక జీవనం ప్రస్తావన ఉందని, ఆధ్యాత్మిక సాహిత్యంలో ఆ స్పృహ కనిపిస్తుందని తెలిపారు. అభ్యుదయ సాహిత్యం కవులు ఏవైపు చూడాలో చెప్పిందని, ప్రజల విముక్తి కోసం విప్లవ సాహిత్యం వచ్చిందని, ఆ తరువాత కాలంలో సాహిత్యంలో సూక్ష్మ వర్గీకరణ వచ్చిందని చెప్పారు. సాహితీ ఉద్యమంతో పాటు ప్రజల మధ్యలో ఉండి ఉద్యమం చేసిన గొప్ప కవి దాశరథి అని, నిజాం నిరంకుశ పాలనలో పీడిత ప్రజానీకానికి ఆయన వాణి అయ్యారని తెలిపారు. రాజ్యాంగ నైతికతను ప్రబోధించే విధంగా కవిత్వం రాయాలని అన్నారు. ఆంధ్ర జ్ఞానపీఠ్‌గా పేర్కొనే కళా ప్రపూర్ణ అవార్డును ఇచ్చే ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రాంగణంలో దాశరథి శతజయంతి ఉత్సవం జరుపుకోవడం సంతోషదాయకమని అన్నారు. నిజాం నవాబుపై ధిక్కార స్వరం వినిపించి రాజును ముసలి నక్క అంటూ కవిత్వం రాసిన గొప్పకవి దాశరథి అని చెప్పారు. వైవీకే అధ్యయన కేంద్రం నిర్వాహకులు జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజల కష్టాలపై సాహితీ పోరాటం చేయడంతో పాటు ప్రత్యక్ష కార్యాచరణకు దిగిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య అని పేర్కొన్నారు. తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని, తెలుగు భాష ఉద్ధరణ కోసం కృషి చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు మరోపక్క ఆంగ్ల భాషలో బోధనను తీసుకొస్తున్నాయని అన్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం జరగాలని, మాతృభాషపై పట్టు ఉన్నప్పుడే ఇతర భాషల్లోనూ పట్టు వస్తుందని, పరిశోధనలు ఇదే అంశాన్ని చెబుతున్నా యని తెలిపారు. సభలో ఆంధ్ర యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.నరసింహారావు, తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య చందు సుబ్బారావు, మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు విస్తాలి శంకర్రావు, అరసం తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి సోమశిల తిరుపోలు, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా కార్యదర్శి సీఎస్ క్షేత్రపాల్, అరసం, వైవీకే మార్క్సిస్టు అధ్యయన కేంద్రం సభ్యులు ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి సురుచి రూ.20 లక్షలు

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: విజయవాడ బాధితులకు అండగా 'నేను సైతం' అంటూ ముఖ్యమంత్రి సహాయనిధికి తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు 20 లక్షల రూపాయల విరాళం అందజేశారు. మంగళవారం ఆయన మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి... ఆ మొత్తానికి డిడి అందజేశారు. 'కృష్ణాకు గోదావరి సాయం' పేరిట ఇస్తున్న ఈ విరాళం వెనుక గోదావరి ప్రజలు, తమ సిబ్బంది ఉన్నారని మల్లిబాబు తెలిపారు. వరద బాధితులకు సహాయం అందించేందుకు సురుచి ఫుడ్స్ తాపేశ్వరం, కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేటలోని ఏడు బ్రాంచీలలో సెప్టెంబర్ 9వ తేదీ ఆదివారం చేసిన అమ్మకం మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ఆయన పవన్ కల్యాణ్‌కు చెప్పారు. కార్యక్రమంలో మల్లిబాబుతో పాటు సురుచి పీఆర్ఓ వర్మ పాల్గొన్నారు.

15న రైతునేత వైవీకే జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతాంగ అభ్యున్నతి, హక్కుల కోసం జీవితాంతం కృషిచేసిన రైతు నేత వైవీ కృష్ణారావు (వైవీకే) 110వ జయంతిని ఈనెల 15వ తేదీన ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులర్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కృష్ణారావు 1915 సెప్టెంబరు 15న కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా పెద్ద అవుటుపల్లిలో జన్మించారని, 1951 నుంచి 1987 వరకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. 1986లో అఖిల భారత కిసాన్‌సభకు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారని, 1993లో అధ్యక్షులుగా ఎన్నికై 1997వరకు కొనసాగారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 12 ఏళ్లపాటు శాసన మండలిలో సీపీఐ పక్ష నేతగా పనిచేశారన్నారు. 2010 డిసెంబరు 26న కృష్ణారావు మృతి చెందారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యులయ్యారని, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలోనూ కీలక భూమిక పోషించారన్నారని వివరించారు. వ్యవసాయ రంగంపై అనేక పుస్తకాలు రాశారని, ప్రతిష్ఠాత్మక గ్రంథం ఆంధ్రప్రదేశ్ దర్శిని రూపొందించారని తెలిపారు. జాతీయ వ్యవసాయ ధరల కమిషన్ సభ్యుడిగా పనిచేసి అనేక సేవలందించారన్నారు.

లక్షలాది మంది జలసమాధికి కుట్ర: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకాశం బ్యారేజీని కూల్చి లక్షలాది మంది ప్రజలను జలసమాధి చేయాలన్న జగన్ కుట్ర బయటపడిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మంగళవారం జగన్‌పై విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉండగా సైకో జగన్... తన ఇసుక మాఫియా కోసం అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయేలా చేసి 50 మందిని చంపేసి, ఐదు ఊర్లు నామరూపాలు లేకుండా చేశారని అన్నారు. ఇదే ప్రణాళిక ప్రకారం ఇనుప పడవలతో ప్రకాశం బ్యారేజి ఢీకొని కూల్చేసి, విజయవాడతో పాటు లంక గ్రామాలు నామ రూపాలు లేకుండా చేసి, లక్షలాది మంది జల సమాధి అయ్యేలా సైకో పన్నిన కుట్ర బట్టబయలైందని అన్నారు. కుట్రకు ప్లాన్ చేసింది జగన్ అయితే, అమలు చేసింది వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌లని ఆరోపించారు. తమ కుట్రలు బయటపడకుండా వరద ముంపునకు ప్రభుత్వమే కారణమంటూ విషప్రచారం చేయడంపై లోకేశ్ మండిపడ్డారు.

పాత్రధారులు, సూత్రధారులను అరెస్ట్ చేయాలి: వర్ల

ప్రకాశం బ్యారేజ్ విధ్వంసానికి ఇసుక బోట్లతో కుట్రపన్నిన పాత్రధారులు, సూత్రధారులను అరెస్ట్ చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కుట్ర వెనుక జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, నందిగం సురేశ్, తలశిల రఘురామ్ పాత్ర ఉందని ఆరోపించారు. వరదకు ముందు రోజు ఉద్దండరాయునిపాలెం వైపు ఉన్న పడవలను కావాలనే ప్రకాశం బ్యారేజ్ వైపునకు తెచ్చి.. బ్యారేజ్‌ను ఢీ కొనే విధంగా నిలబెట్టారని మండిపడ్డారు. ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని, డీజీపీ దృష్టిపెట్టాలన్నారు.

బుడమేరు ఆక్రమణలు తొలగిస్తాం: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బుడమేరు ఆక్రమణలు తొలగింపుపై సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా ఆక్రమించుకుని ఉన్నవారికి ప్రత్యామ్నాయం చూపించే తొలగిస్తామన్నారు. అవసరమైతే కొత్త చట్టం తెస్తామని చెప్పారు. బుధవారం ఉదయానికల్లా విజయవాడ నగరంలో వరద నీరు లేకుండా చేస్తామని పేర్కొన్నారు. ఇంటింటి నష్టం అంచనా ప్రక్రియ అవసరమైతే మరో రోజూ పొడిగిస్తామని చెప్పారు. సర్వే సమయంలో ఎవరైనా ఇంట్లో లేకపోయినా... వేరే ప్రాంతానికి వెళ్లినా వారు వచ్చాక కూడా నష్టం అంచనా నమోదు చేస్తామన్నారు. 10 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు పగలు రాత్రి కష్టపడి పనిచేస్తున్నారన్నారు. బుధ, గురువారాల్లో అవసరమైన చోట ఆహారం అందిస్తామని వెల్లడించారు. కాగా, బుడమేరు వరద ప్రాంతాల్లో నారాయణ ఉదయం పర్యటించారు. సింగ్‌నగర్‌లో వరద ముంపు తగ్గిందన్నారు. నాలుగైదు డివిజన్‌లలో లోతట్టు ప్రాంతాల్లో నీరు ఉందన్నారు. కండ్రిక వద్ద రోడ్డు ఒక వైపు నీరు నిలవడంతో మోటార్లతో కాలువలకు మళ్లించామని తెలిపారు. పాడైన వస్తువులు, వాహనాల విషయంలో కూడా ఇన్సూరెన్స్ కంపెనీలతో ప్రభుత్వం మాట్లాడుతుందని తెలిపారు. వాహనాల మరమ్మత్తులకు యాభై శాతం ప్రభుత్వం భరిస్తుందన్నారు. మూడు రోజుల్లో విజయవాడ పూర్తిగా యథాస్థితికి వస్తుందని చెప్పారు. సర్వే బుధవారంతో ముగుస్తుందని తెలిపారు. నివేదికను సీఎం పరిశీలించి బాధితులకు సాయం అందిస్తారని మంత్రి వివరించారు.

అందుబాటులో 14,20,079 మెట్రిక్ టన్నుల ఇసుక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉచిత ఇసుక మంగళవారం ఉదయానికి 28 నిల్వ కేంద్రాలలో 14,20,079 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని రాష్ట్ర గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 502 మంది దరఖాస్తుదారులకు 4,914 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేసామని వివరించారు. చాలాచోట్ల రహదారులు దెబ్బతినడంతో ఇసుక రవాణా పరంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని చెప్పారు. భారీ వర్షాలు, వరదల వల్ల ఇసుక నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయని, వర్షాకాలం ముగిసిన తరువాత ఇసుక కొరత ఉండబోదన్నారు.

బుడమేరు ముంపునకు శాశ్వత నివారణ

చంద్రబాబుకు సీపీఎం బృందం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బుడమేరు శాశ్వత ముంపు నివారణా చర్యలు చేపట్టాలని, కృష్ణానది కరకట్ట బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం బృందం డిమాండ్ చేసింది. కృష్ణానది, బుడమేరు వరదల మూలంగా విజయవాడ నగరం, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రజలకు, ఆస్తులకు జరిగిన అపార నష్టాన్ని కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, తక్షణమే రూ.10 వేల కోట్లు విడుదల కోసం ఒత్తిడి తీసుకురావాలని కోరింది. సీపీఎం రాష్ట్ర ప్రతినిధివర్గ బృందం మంగళవారం ఎన్టీఆర్‌జిల్లా కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసింది. వరద సహాయం క్షేత్రస్థాయిలో అందేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.25 వేలు ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువులు, పాత్రలు, బట్టలు, ఆగస్టు, సెప్టెంబరు విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని, పంట రుణాలు రద్దు చేయాలని, కౌలు రైతులకు నష్టపరిహారం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, డ్వాక్రా, పొదుపు సంఘాలు, వృత్తిదారుల రుణాలు మాఫీ చేయాలన్న తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. బృందంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, డి.రమాదేవి, కె.ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రతి ఒక్కరూ వరద బాధితులకు చేయూతనివ్వాలి

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర- ఏలూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకు నేందుకు సీపీఐ ఏలూరు ఏరియా సమితి అధ్వర్యంలో పవర్ పేట రైల్వే స్టేషన్ నుండి ఆర్ ఆర్ పేట మెయిన్ రోడ్డులో విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర, కోస్తా లోతట్టు ప్రాంతాలన్నీ వరద ముంపునక గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విజయవాడ నగరంలో బుడమేరు పరివాహక ప్రాంతాలైన రాజరాజేశ్వరిపేట, అజిత్ సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో వరదల కారణంగా అనేక మంది ప్రజలు కట్టుబట్టలతో తమ సొంత ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం అన్ని విధా లుగా సహాయం అందిస్తున్నప్పటికీ జరిగిన నష్టం తీవ్రతను బట్టి ప్రజలంతా వారిని ఆదుకోవడానికి భాగస్వామ్యులు కావాలన్నారు. వరద బాధితుల సహాయార్థం సీపీఐ సేకరిస్తున్న నిధికి విరివిగా విరాళాలు ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడానికి సీపీఐ ఇప్పటికే ఆహారం, తాగునీరు, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు వంటివి పంపిణీ చేస్తోందని తెలిపారు. మరింత విస్తృతంగా సహాయాన్ని అందించేందుకు ప్రజల వద్దకి వెళ్లి విరాళాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. వాటిని రాష్ట్ర పార్టీకి పంపించడం ద్వారా వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న మరింత మంది ప్రజలకు సహాయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, ఏలూరు సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శి కరెళ్ల వర ప్రసాద్, ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, కౌన్సిల్ సభ్యులు కొల్లూరు సుధారాణి, గొర్లి స్వాతి, మూర్తి ,లక్ష్మి, భవాని, శయన అభిలాష్ కుమార్, కాటూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం

రామచంద్రయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వీ రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో మంగళవారం జిల్లాలో దెబ్బతిన్న పంట చేలను పరిశీలించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె జగన్నాథం, జిల్లా అధ్యక్షుడు పంపన్నగౌడ్, ఉపాధ్యక్షుడు బీ గిడ్డయ్య, కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్యతో కలిసి కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆస్పరి, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎండిపోయిన, నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ... ఖరీఫ్‌లో ఆలస్యంగా వర్షాలు పడటం వలన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం అధిక వర్షాల వల్ల హంద్రీ పరివాహ ప్రాంతమైన పత్తికొండ, గోనెగండ్ల, దేవనకొండ, ఆస్పరి ప్రాంతాలతోపాటు, హొళగుంద, తదితర ప్రాంతాల్లో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయా రన్నారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులను పంపి పంట నష్టం అంచనాలు వేయించాలని... నష్టపోయిన రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన పత్తి, మిర్చి, ఉల్లి రైతులకు ఎకరాకు రూ.40వేలు, కొర్ర, సజ్జ ,వరి పంటలకు ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతుసంఘం నాయకులు, సీపీఐ , ప్రజాసంఘాల నాయకులు రాజాసాహెబ్, గురుదాస్,ఈరన్న , రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 85 రద్దు చేయండి

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె ప్రారంభం

విశాలాంధ్ర, పార్వతీపురం/ సీతానగరం: ఏపీ ప్రభుత్వం జీవో 85 రద్దు చేయాలని మంగళవారం నుంచి పీహెచ్‌సీ వైద్యులు సమ్మె ప్రారంభించారు. ఈ జీఓ ద్వారా తమ మూడేళ్ల సర్వీసు పోయిందన్నారు. అకస్మాత్తుగా జీఓ మార్చడం అన్యాయమన్నారు. గత రెండు నెలలుగా జీఓ రద్దు చేయమని అధికా రులు, ఎమ్మెల్యేలకు అర్జీలు సమర్పించినా ఫలితం లేదని వైద్యులు నిరాశ వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో తమ ప్రాణా లను ఫణంగా పెట్టి సేవలు అందించి నప్పటికీ, జీఓ ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు.విధులు నిర్వహిస్తూనే తొలిరోజు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపామన్నారు. బుధ, గురువారాల్లో సేవలలో అంతరాయం లేకుండా నిరసన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించని పక్షంలో 13వ తేదీన... అత్యవసర సర్వీసులను మినహాయించి, అధికారిక కమ్యూనికేషన్‌లు నిలిపివేస్తామని హెచ్చరించారు. 14న కేవలం అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితం చేస్తామన్నారు. 15న 'చలో విజయవాడ' ర్యాలీ హెల్త్ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామన్నారు. 16 నుంచి జీఓ రద్దు చేసేవరకు నిరవధిక నిరాహార దీక్ష చేపడతామన్నారు. నీట్ పీజీ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ తరువాత ... ఇలా కొనసాగడం సాధ్యం కాక సమ్మెకు దిగవలసి వచ్చిందని వైద్యులు తెలిపారు. సీతానగరం, పెదలంక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఉషారాణి, పావని రాధాకాంత్ నల్ల బ్యాడ్జీలు ధరించి రోగులకు వైద్యసేవలు అందించారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి సేవలు అందించినట్లు వివరించారు.

23 వరకు హజ్ యాత్రకు దరఖాస్తు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: హజ్ యాత్ర కోసం 'హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 23వరకు పొడిగించినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో ఈ సంగతి తెలిపారు.హజ్ దరఖాస్తుల ను పూరించడానికి కేంద్ర హజ్ కమిటీ మొదట ఆగస్టు 13వ తేదీ నుంచి ప్రారంభించి చివరి తేదీ సెప్టెంబర్ 9వ తేదీ వరకు నిర్ణయించిందని, ప్రస్తుతం గడువు పొడిగించినట్లు వివరించారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం కోసం కేంద్ర హజ్ కమిటీ దేశవ్యాప్త ప్రకటన చేయడం జరిగిందని చెప్పారు. ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లాలనుకునే యాత్రికులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.

దసరా ఉత్సవాలకు సత్వర ఏర్పాట్లు

దుర్గగుడి అధికారులకు మంత్రి ఆనం ఆదేశం

విశాలాంధ్ర-విజయవాడ(ఇంద్రకీలాద్రి): ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం అధికారులను దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. మంగళ వారం కనకదుర్గ ఆలయాన్ని సందర్శించిన మంత్రి... కొండపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. దుర్గమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏర్పాట్ల విషయంలో భక్తులకు ఇబ్బందులు కలిగితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. గతంలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని... అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కొండపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రెండు రోజుల్లో రూపొందించాలని దేవస్థానం అధికారులకు స్పష్టంచేశారు. ఈసారి దుర్గమ్మ ఉత్సవాలను గతంలో కన్నా మిన్నగా నిర్వహించడం ద్వారా భక్తుల మనోభావాలు గెలుచుకోవాలని మంత్రి సూచించారు. సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖా కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆలయ ఈవో రామారావు, దేవస్థానం ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చీఫ్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదారులు పాల్గొన్నారు.

విపత్తులు ఎదుర్కోవడంలో చంద్రబాబు ఆదర్శం

హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విపత్తుల నిర్వహణలో సీఎం చంద్రబాబు ఆదర్శంగా నిలుస్తారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం విశాఖ ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ హుదూద్, తిత్లీ తుపానులు, విజయవాడ వరదల నుంచి ప్రజలను కాపాడిన తీరు అందుకు నిదర్శనమన్నారు. నిరంతర సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటన లతో యుద్ధప్రాతిపదికన ముఖ్యమంత్రి సహాయక చర్యలను ముందుకు తీసుకెళ్లారన్నారు. వరద ప్రాంతాలలో పునరుద్ధరణ, సహాయక చర్యలకు సంబంధించి కలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛ, అవసరమైన నిధులు అందుబాటులో ఉంచామన్నారు. రోడ్లతో పాటు ఇళ్లను కూడా శుభ్రపరచడం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. డ్రోన్‌ల ద్వారా ఆహారం పంపిణీతో పాటు క్లోరినేషన్ చేయించడం గొప్పవిషయమన్నారు. వరద బాధితులను ఆదుకోవలసిన ప్రతిపక్ష పార్టీ... ఆపద తేవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వరదలోనూ బురదజల్లే విపక్ష పార్టీ నాయకులు దేశద్రోహులన్నారు. 40 నుంచి 50 టన్నుల బరువున్న 3 బోట్లను నైలాన్ తాడుతో కడితే ఆగుతాయా అని ప్రశ్నించారు. ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఉండాల్సిన పడవలు ప్రకాశం బ్యారేజీకి ఎలా వచ్చాయన్నారు. జలవనరులు, పోలీస్ శాఖ విచారణలో ఉషాద్రి, కోమటి రామ్మోహన్ పడవల యజమానులని తేలిందన్నారు. కృష్ణలంక రిటైనింగ్ వాల్ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సగం పూర్తయిందన్నారు. విశాఖలోని తెన్నేటి పార్కు, గోపాలపురం, సీతమ్మధార ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడకుండా చర్యలు చేపడతామన్నారు.

సంపాదకీయం

దాగుడుమూతలకు నిరసన

కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు గత మూడేళ్లుగా మోదీ ప్రభుత్వం చేయని ప్రయత్నాలులేవు. రాష్ట్ర ప్రజానీకం మద్దతుతో కార్మికులు మొక్కవోని దీక్షతో నిర్వహిస్తున్న ఆందోళన ముందు మోదీ ప్రయత్నాలు ఫలించడంలేదు. దానితోపథకం ప్రకారం స్టీల్ ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం నష్టాల్లోకి నెడుతోంది. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడానికి, సొంత గనులు సమకూర్చడానికి వెనుకాడుతోంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు మద్దతు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇంతకు ముందు అధికారంలో ఉన్న జగన్ మోహన్‌రెడ్డి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కనీస ప్రయత్నం చేయడంలేదు. విశాఖ స్టీలుప్లాంటు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్న కార్మిక సంఘాల, ప్రతిపక్ష పార్టీల డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవినపెడుతున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకుని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ గత 1300 రోజులకు పైగా స్టీల్ ప్లాంట్ వద్ద కార్మిక సంఘాలు, ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వంద శాతం వాటాలు విక్రయించాలని 2021 ఫిబ్రవరిలో కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. కార్మికుల, ఉద్యోగుల మనోభావాలను పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు, నిధులు రాకుండా చేసి పరిశ్రమను నష్టాలపాలు చేసి విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి దానికి అదే మూతపడేటట్లు చేసే కుట్రలో భాగంగా బ్లాస్టు, ఫర్నిసు, ముడి సరుకు సరఫరా చేయకుండా కేంద్రం ఇబ్బంది పెడుతోంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపు చేస్తామని చెప్పిన మాటలు ఎన్నికల తరువాత నీటిమూటలుగా మారిపోయాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడి ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించేలా చేస్తాను 45 రోజులు గడువు ఇవ్వాలని కోరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ ఆ గడువు దాటిపోయినా నోరు మెదపడంలేదు. ప్లాంట్‌ను సందర్శించి ప్రైవేటీకరణ ఉండబోదని చెప్పిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి దిల్లీ వెళ్లాక ఆ ఊసే ఎత్తలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ వ్యవహారం మొత్తం చూస్తూ కూర్చోవడం తప్ప ప్రైవేటీకరణ ప్రయత్నాలు అడ్డుకునేందుకు చేస్తున్న కృషి శూన్యం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దాగుడుమూతలను నిరసిస్తూ, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనీ, సెయిల్ లో విలీనం చేసి, పూర్తి సామర్థ్యం తో నడపాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సమన్వయ సంఘాల సమన్వయ సమితి పిలుపు అందుకని మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వామపక్ష పార్టీలు ఈ ఆందోళనకు సంఘీభావం ప్రకటించాయి. కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో విజయవంతం అయింది. ప్రభుత్వం ఎప్పటిలానే నిర్బంధాలు, అరెస్టులు, అణచివేతలకు పాల్పడింది. నిరసనలో పాల్గొన్న నాయకుల అరెస్టులు, తోపులాటలు షరామామూలే. స్టీల్ ప్లాంట్ కార్మికులు జాతీయ రహదారిని దిగ్బంధించి ఆందోళన చేపట్టడంతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముఖద్వారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిరసన కొనసాగిస్తున్న దీక్షా శిబిరం నుంచి కార్మికులంతా బయటకువచ్చి రోడ్డుపై బైఠాయించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా కేంద్రం నిర్ణయం తీసుకోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేపట్టిన ఉక్కు ఉద్యోగులను దాదాపు 40 మందిని అరెస్టు చేసి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. స్టీల్‌ప్లాంట్‌లో గుర్తింపు పొందిన ఏఐటీయూసీ అనుబంధ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకులు డి ఆదినారాయణ, కె ఎస్ ఎన్ రావు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు స్టీల్ ప్లాంట్ కార్మికులంతా రాస్తారోకో నిర్వహించారు. వరదలు, భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమౌతూ ప్రజలు అల్లాడుతున్నప్పటికీ స్టీల్‌ప్లాంట్‌ను సంరక్షించుకోవాలన్న ఉక్కు సంకల్పంతో మంగళవారంనాటి రాస్తారోకోలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 32 మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కుప్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వక్తులకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలన్న నినాదాలతో వీధులు మార్మోగాయి. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరించే, కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి స్వంత గనులు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించడాన్ని తప్పుపట్టారు.

ఉత్పత్తిలో విశాఖ స్టీల్ ప్లాంట్ 120 శాతం రేటింగ్ సామర్థ్యంతో ప్రసిద్ధి చెందింది. గతంలో లాభాలు ఆర్జించింది. సొంత ఆర్థిక వనరులను ఉపయోగించి ఉత్పత్తి 3.4 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి పెరిగింది. మూలధన పెట్టుబడి, ముడిసరుకు సరైంతగా సమకూర్చకపోవడంతో ప్రస్తుతం 50 శాతం సామర్థ్యంతోనే నడుస్తోంది. ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా పునరుద్ధరిస్తే వీలైనంత తొందరగా లాభాల్లోకి వస్తుంది. దీనికోసం వెంటనే వర్కింగు కేపిటల్‌ను ఏర్పాటు చేసి, అసరమైన బ్యాంకు రుణాలు తీసుకునేందుకు లెటర్ ఆఫ్ కంఫర్ట్ జారీ చేయాల్సిన అవసరం ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంటుకు మినహా దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు క్యాప్టివ్ మైన్స్ ఉన్నాయి, ప్లాంటు నిరంతరం పనిచేయడానికి, వీలైనంత ఎక్కువ బఫర్‌స్టాకును ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించాలి. ప్రజాందోళనను ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం గుర్తించి విశాఖ ఉక్కులో వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనను ఉపసంహరించుకుని, కంపెనీ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్ఐఎన్ఎల్ మనుగడ, సుస్థిరత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మళ్లీ సెయిల్‌లో విలీనం చేయాలి. కేంద్ర ప్రభుత్వం ద్వారా రుణాలు ఇవ్వడం, మూడు సంవత్సరాల పాటు పన్ను మినహాయింపు ప్రకటించడం, ప్లాంట్ సామర్థ్యం స్థిరీకరించే వరకూ ఆర్థిక సహాయం అందిస్తుండటం, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయడం, కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడం, క్యాప్టివ్ ఇనుప ఖనిజం గనుల కేటాయింపు కోసం సెయిల్ లేదా ఎన్ఎండీసీ నుంచి ముడి సరుకు సరఫరా చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాధినేతలు మౌనంవీడి విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే ప్రతిపాదనను ఉపసంహరించుకునేలా మోదీపై వత్తిడి తీసుకురావాలి. అవసరమైతే ఈ విషయమై కేంద్రంతో మాట్లాడేందుకు అఖిలపక్ష బృందాన్ని, కార్మిక, రైతుసంఘాల ప్రతినిధులను దిల్లీకి తీసుకువెళ్లాలి. కార్మిక సంఘాలు ఉద్యమిస్తే అరెస్టులు, తప్పుడు కేసులు పెట్టే చర్యలను విడనాడాలి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకుని, ప్లాంట్‌కు కావాల్సిన అన్నింటిని సమకూర్చే వరకూ కార్మికసంఘాలు ఉక్కుసంకల్పాన్ని ఏమాత్రం సడలించకుండా మొక్కవోని దీక్షతో పోరాటం కొనసాగించాలి.

గర్వకారణమైన జ్ఞాపకం

సురవరం సుధాకర్ రెడ్డి

మొగల్ సామ్రాజ్యం దక్షిణ భారతదేశాన్ని జయించి ఔరంగజేబు మరణం తర్వాత వారి రాజప్రతినిధిగా వచ్చిన సైనికాధిపతులే నిజాం రాజులు. ఢిల్లీలో మొగల్‌సామ్రాజ్య ప్రాభవం తగ్గగానే స్వతంత్రం ప్రకటించుకున్నారు. ఆ తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో రాజీపడ్డారు. దేశంలో 550 సంస్థానాలుండగా, అన్నింటికంటే పెద్దది నిజాం సంస్థానం. నిజాం మైసూరురాజు టిప్పు సుల్తాన్‌కు, మహారాష్ట్రులకు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు మద్దతు ఇచ్చినందుకు, నిజాం నవాబును కాపాడేందుకు బ్రిటిష్ సైన్యాన్ని ఇక్కడ ఉంచారు. వారి ఖర్చుల నిమిత్తం, సర్కారు జిల్లాలను, ఆ తర్వాత రాయలసీమను వారికి అప్పగించారు. అయినా మిగిలిన హైదరాబాదు సంస్థానం దేశంలోని 550 సంస్థానాలలో పెద్దది. దీని వైశాల్యం 82,696 చదరపు మైళ్ళు. ఇది గ్రేట్ బ్రిటన్ వైశాల్యానికి సమానం. ఇందులో ఎనిమిది తెలుగు జిల్లాలు, ఐదు మరాఠీ జిల్లాలు, మూడు కర్నాటక జిల్లాలు ఉండేవి. కోటి ఎనభై లక్షల జనాభాలో సగంమంది మాతృభాష తెలుగు, 25 శాతం మంది మరాఠీ, 12 శాతం మంది ఉర్దూ, 11 శాతం మంది కన్నడ, ఇతర భాషలు మాట్లాడేవారు. కాని ఉర్దూలో తప్ప పాఠశాలలు లేవు. ఆరు శాతం ప్రజలు మాత్రమే అక్షరాస్యులు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెడిసిన్, ఇంజనీరింగ్ కూడా ఉర్దూలో బోధించేవారు.

ప్రైవేటుగా మాతృభాషలో పాఠశాలలు పెట్టుకోవడానికి వీల్లేదు. గ్రంథాలయాలకు కూడా అనుమతి కావాలి. పత్రికలున్నా తీవ్రమైన సెన్సార్ వుండేది. భారతదేశంలో హైదరాబాదు సంస్థానం ఒక చీకటి రాజ్యం. తెలంగాణప్రాంతంలో భూ కేంద్రీకరణ విపరీతంగా వుండేది. మొత్తం సాగులోవున్న భూమి దాదాపు 70% భూస్వాముల చేతుల్లోవుండేది. ఐదువేల ఎకరాలపైన వున్న భూస్వాములు 550 మంది. రాష్ట్రం మొత్తంమీద చిన్న పెద్ద భూస్వాములలో 1982 మంది ముస్లింలు, 618 మంది హిందూ భూస్వాములు వుండేవారు. నిజాం సొంత ఖర్చులకోసం 636 గ్రామాల్లో ఐదు లక్షల ముప్పైవేల ఎకరాల భూమి వుండేది. నిజాం రాజులు అత్యంత విలాసంగా జీవించేవారు. అనేకమంది భార్యలు, ఉంపుడుగత్తెలు వుండేవారు. 7వ నిజాం ఆస్తి ఆనాడు 400 కోట్ల రూపాయలు. అప్పుడు ప్రపంచంలోకెల్లా ధనవంతుడని పేరుండేది. రాష్ట్రంలో ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు దుర్భర జీవితం గడిపేవారు. అన్ని కులాలవారు, జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, ప్రభుత్వ అధికారుల దగ్గర వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. నిజాం ప్రభుత్వంలో ఎక్కువమంది అధికారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారే. ముఖ్యంగా యు.పి. ముస్లింలు. దీనివల్ల స్థానిక ముస్లింలలో అసంతృప్తి వచ్చింది. ముల్కి (స్థానిక)లకే ఉద్యోగాలు కావాలని ఆందోళనలు 6వ నిజాం మహబూబ్‌అలీఖాన్ హయాంలోనే ప్రారంభమైంది. హిందువులకు నామమాత్రమైన ఉద్యోగాలు మాత్రమే ఇచ్చేవారు. గ్రామీణ ప్రాంతాలలో దారుణమైన దోపిడీ, వెట్టిచాకిరీ (వేతనం ఇవ్వకుండా ఉచితంగా పని చేయించుకోవటం) వుండేది. ఊళ్ళో రైతులందరూ ముందుగా దేశ్‌ముఖ్, జాగీర్దారుల భూములు దున్ని తర్వాత తమ భూములు దున్నుకోవాలి. చెరువునీళ్ళు ముందు భూస్వాములకే ఇవ్వాలి. దళితులు గడీ ముందు ఊడ్చి, శుభ్రంచేసి సాన్పి (కళ్ళాపి) చల్లి, పశువుల దొడ్డి శుభ్రంచేసి, మేతవేసి ఇతర పనులు చేయాలి. యజమాని, ఆయన కుటుంబ సభ్యులకు, ఆయన పాలేర్లకు ఉచితంగా చెప్పులు ఇవ్వాలి.

చాకలి ఉచితంగా బట్టలు ఉతకడం, దొర, ఆయన కుటుంబ సభ్యులు బయటి ఊళ్ళకు పోతే వారి కచ్చడం (కోడెల బండి) ముందు పెట్టి నెత్తిన పెట్టుకుని పరిగెత్తాలి. మంగలి ఉచితంగా క్షౌరం చేయడం, పశువులకు వైద్యం చేయాలి. పద్మశాలీలు ఉచితంగా బట్టలు నేసి ఇవ్వాలి. పెళ్ళిళ్ళు, ఉత్సవాలకు అదనపు బట్టలివ్వాలి. యాదవులు ఉచితంగా గొర్రెలివ్వాలి. పాడి వున్న రైతులు ఉచితంగా పాలు పోయాలి. వైశ్యులు ఉచితంగా సరుకులు దేశ్‌ముఖ్‌లకు, అధికారులకు ఇవ్వాలి. బ్రాహ్మణులు ఉచితంగా విస్తర్లు కుట్టి ఇవ్వాలి. గౌడ్‌లు ఉచితంగా కల్లు సప్లయ్ చేయాలి. ఇవేకాకుండా దొరల ఇండ్లలో పెండ్లిళ్ళకు అందరు ఉచితంగా పాలు, గొర్రెలు, కోళ్ళు, ధాన్యం ఇచ్చి పనిచేయాలి. అనేక పేద కుటుంబాలవారి మహిళలు మానభంగానికి గురయ్యేవారు. పేదలు దౌర్జన్యానికి గురయ్యేవారు. ఇచ్చిన అప్పుకు అనేక రెట్లు వడ్డీ వసూలుచేసి ఇవ్వకపోతే వారి ఇళ్ళు, భూములు స్వాధీనం చేసుకునేవారు. తప్పుడు కేసులు పెట్టేవారు. కరణాలు తప్పుడు లెక్కలురాసి పేదల భూములు కాజేసేవారు. తెలంగాణలో తెలుగు ప్రజల సంఘంగా ఆంధ్రజనసభ ప్రారంభమైంది. అది ఆంధ్ర మహాసభగా రూపొందింది. జోగిపేట ప్రథమ ఆంధ్ర మహాసభ సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టడం, విజ్ఞప్తులు చేయడంతో ప్రారంభమైంది. యువతరం ముందుకు వచ్చి ఆంధ్ర మహాసభలో చురుకైన పాత్రతో సమస్యలు మీద పోరాటం ప్రారంభించారు. రావి నారాయణరెడ్డి అధ్యక్ష స్థానానికి పోటీ చేసి 10వ మహాసభలో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం ఇచ్చారు. 1946 నాటికి ఆంధ్ర మహాసభ ప్రధాన రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది.

ఫ్యూడల్ దోపిడీ, దౌర్జన్యాలతో హిందూ భూస్వాములు కూడా ప్రధాన పాత్ర వహించారు. ఈ దశలో ఆంధ్ర మహాసభలో మితవాదులు, అతివాదులు, జాతీయవాదుల మధ్య ఘర్షణలో వామపక్షవాదులు మెజారిటీ అయ్యారు. రావి నారాయణరెడ్డి అధ్యక్షుడైన తర్వాత పేద ప్రజల సమస్యలు, తెలుగులో బోధన, వెట్టిచాకిరీ రద్దు తదితర అంశాలపైన కార్యాచరణ తీసుకున్నారు. హైదరాబాద్‌లో మఖ్దుం, రాజబహదూర్ తదితరులు కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటుచేశారు. ట్రేడ్ యూనియన్లు నిర్మించారు. ముస్లిం మేధావులు కూడా ఫ్యూడల్ రాచరికానికి వ్యతిరేకంగా గళమెత్తారు. భారత యూనియన్‌లో చేరనని "ఆజాద్ హైదరాబాద్" అని స్వతంత్ర రాజ్యాన్ని 7వ నిజాం ఉస్మాన్ అలీఖాన్ ప్రకటించారు. దేశవ్యాపితంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం హైదరాబాద్ సంస్థాన ప్రజల మీద ప్రభావం చూపింది. గోలుకొండ పత్రిక, మీజాన్ పత్రిక (తెలుగు), కొన్ని ఉర్దూ పత్రికలు ప్రజలలో చైతన్యం పెంచాయి.

ఖాశిం రజ్వీ అనే వ్యక్తి మజ్లిస్ పార్టీకి అధ్యక్షుడై, హైదరాబాదును స్వతంత్ర ముస్లిం రాజ్యం చేస్తానని ప్రకటించి రజాకార్ల (వలంటీర్) నిర్మాణానికి పూనుకుని వేలాదిమంది ముస్లిములను చేర్పించి దాడులు ప్రారంభించాడు. నిజాం మద్దతిచ్చాడు. రజాకార్లకు హిందూ భూస్వాములు మద్దతిచ్చారు. దౌర్జన్యాలు పెరిగేకొద్దీ ప్రతిఘటన పెరిగింది. తెలంగాణను ముస్లిం మెజారిటీ సంస్థానంగా చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి 8 లక్షలమంది ముస్లింలను అంతకు ముందు తీసుకువచ్చారని ఒక ఆరోపణ వుంది. ఈ దశలో కేంద్ర ప్రభుత్వానికి నిజాంకు మధ్య అనేక చర్చల తర్వాత యథాతథ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం నిజాం రాజుగా కొనసాగుతాడు. యూనియన్ సైన్యాలు ఉపసంహరించారు. విదేశాంగ, రక్షణ కేంద్రం బాధ్యతల్లో వుంటుంది. సంస్థాన అంతరంగిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకోదు. ఇది రాష్ట్ర ప్రజలకు కేంద్రంచేసిన ద్రోహం. ఈలోగా విసునూరి రామచంద్రారెడ్డి (20 గ్రామాలలో 40 వేల ఎకరాల భూస్వామి) ప్రజలమీద దాడులు ఉధృతం చేశాడు. ఆయన తల్లి జానకమ్మ నరరూప రాక్షసి. ఆమె కడివెండి గడీలో ఉంటూ దౌర్జన్యాలు చేసేది. కడివెండిలో ప్రజలు బలవంతపు ధాన్యం లెవీకి వ్యతిరేకంగా ఊరేగింపు తీస్తే, గడీలోంచి కాల్పులు జరిపి, దొడ్డి కొమరయ్యను బలి తీసుకున్నారు. ప్రతి రైతు తను పండించిన పంటలో కొంత భాగం ప్రభుత్వానికి చెల్లించేవి లెవీ. భూస్వాములు, దేశ్‌ముఖ్‌లను వదిలిపెట్టి సామాన్య, పేద రైతులమీదనే ఈ లెవీ దౌర్జన్యంగా వసూలు చేసేవారు. అనేక ఇతర గ్రామాలలో రజాకార్లు గ్రామాలను తగలబెట్టి, స్త్రీలను మానభంగాలు చేశారు. అనేకమందిని చంపేశారు. బైరాన్‌పల్లి, పరకాల తదితర గ్రామాలలో డజన్ల సంఖ్యలో ప్రజలు హతులయ్యారు. కామ్రేడ్ సి.ఆర్. (చంద్ర రాజేశ్వరరావు), సుబ్బారెడ్డి అనే మారుపేరుతో రెడ్డి హాస్టలులో చేరి, రావి నారాయణరెడ్డి, గురవారెడ్డి, మఖ్దుం, రాజ్‌లను పార్టీ సభ్యులుగా చేర్చి పార్టీ నిర్మాణం ప్రారంభించారు. సర్వదేవభట్ల రామనాథం తదితరులు వరంగల్‌లో కార్మిక సంఘాల పోరాటాలు నడిపారు. ఎస్.వి.కె. ప్రసాద్, తమ్మారెడ్డి తదితరులను ఆంధ్ర పార్టీ తెలంగాణకు పంపింది. సుందరయ్య ఆంధ్ర పార్టీని నిరంతరం గైడ్ చేశారు.



ఈ నేపథ్యంలో 1947 సెప్టెంబరు 11 వ తేదీన నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసి సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకుగాను, సాయుధపోరాటం చేయవలసిందిగా రావి నారాయణరెడ్డి, మఖ్దుం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి పేరుతో ప్రకటన విడుదల చేశారు. సాయుధ పోరాటం దావానలంలాగా వ్యాపించింది. రజాకార్లు, నిజాం పోలీసులు, భూస్వాములు ఒకవైపు, కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రజలు మరొకవైపు మోహరించారు. మధ్యతరగతి రైతులు, మేధావులు, వర్తకులు పోరాటానికి మద్దతిచ్చారు. కొంతమంది చైతన్యవంతులైన పెద్ద రైతులు, కరణాలు కూడా చేయికలిపి పేద ప్రజలకు అండగా నిలబడ్డారు. గ్రామాలలో ఆంధ్ర మహాసభ సభ్యత్వం వుంటే వెట్టిచాకిరీ రద్దవుతుందని పేదలకు విశ్వాసం కలిగింది. వాస్తవానికి భూస్వాముల తరఫున వెట్టిచాకిరీకి పిలవడానికి వచ్చిన గుండాలు ప్రజలు చిట్టీ (సభ్యత్వ రసీదు) చూపగానే వెనక్కు వెళ్ళేవారు. ప్రజలు దీనిని గుదుప సంఘం (లాఠీల సంఘం) అనేవారు. ప్రజల దగ్గర ఆయుధాలు లేకపోయినా లాఠీలతో, వడిసెళ్ళతో, స్త్రీలు కారంపొడితో, రాళ్ళతో రజాకార్లను ప్రతిఘటించేవారు. నాటు తుపాకులు తయారుచేసుకున్నారు. రజాకార్ల నుంచి లాక్కున్న ఆయుధాలతో యుద్ధం చేశారు.

ఈ పోరాటం ముఖ్యంగా నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో విస్తృతంగా, ఇతర జిల్లాల్లో కొంత పరిమితంగా జరిగింది. కాని దాదాపు అన్ని జిల్లాల్లో జరిగింది. కోస్తాంధ్ర, రాయలసీమ నుంచి వాలంటీర్లుగా కార్యకర్తలు, ధన సహాయం, ఆయుధ సహాయం చేశారు. భూస్వాములు గ్రామాలు వదిలి హైదరాబాదుకు, ఇతర రాష్ట్రాలకు పారిపోయారు. 3000 గ్రామాలను కమ్యూనిస్టు పార్టీ ప్రభావితం చేసింది. దాదాపు పదిలక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది. పోరాటం నగర సరిహద్దుల దాకా వస్తున్నదనే అభిప్రాయం కలిగింది. ఆ సమయంలో అరాచకత్వాన్ని, హింసను అరికట్టే పేరుతో యూనియన్ సైన్యాలు హైదరాబాదు సంస్థానాన్ని అన్నివైపుల నుంచి ముట్టడించాయి. కొన్నిచోట్ల ప్రతిఘటించినా 3 రోజుల్లో నిజాం సైన్యం లొంగి పోయింది. నిజాం స్వయంగా లొంగిపోతున్నట్లు ప్రకటించాడు. ఇదొక లాలూచీ కుస్తీ.

మిలటరీ గవర్నరుగా నియమితులైన జనరల్ చౌదరి కొందరు రజాకార్లను, ఖాశిం రజ్వీని అరెస్టుచేసి, కమ్యూనిస్టులమీద యుద్ధం ప్రకటించాడు. సుప్రసిద్ధ గాంధేయవాది సరోజినీనాయుడు కుమారుడు డా॥ జయసూర్య, మరికొందరు మిలటరీ గవర్నరును కలిసి తమకు నెల రోజులు గడువిస్తే, కమ్యూనిస్టులతో చర్చించి, సాయుధ పోరాటాన్ని ఉపసంహరింపజేస్తామని, ఆయుధాలు అప్పగించమని కోరుతామని చెప్పారు. దానికి జనరల్ చౌదరి, అహంకారంతో నిరాకరించి నెల రోజులెందుకు, వారం రోజుల్లో తెలంగాణలో కమ్యూనిస్టులను ఏరివేస్తానని జవాబిచ్చాడు. అధునాతన ఆయుధాలతో గ్రామాల మీదపడి కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, సానుభూతిపరులనుకున్న వారిమీద చిత్రహింసలు, హత్యాకాండ సాగించారు. పారిపోయిన భూస్వాములు యూనియన్ సైన్యాలతోపాటు, గ్రామాలకు తిరిగి వచ్చారు. కుచ్చుటోపీలు, షేర్వానీలు వదిలేసి, గాంధీటోపీలు, ఖద్దరు చొక్కాలతో దర్శనమిచ్చారు. తాము కోల్పోయిన భూములు తిరిగి బలవంతంగా లాక్కున్నారు. అనేకచోట్ల ప్రజలు ప్రతిఘటించారు. అనివార్యంగా సాయుధ పోరాటం కొనసాగింది. హైదరాబాదు సంస్థానం, భారత యూనియన్‌లో విలీనమైనందున, నిజాం దుష్ట ప్రభుత్వం కూలిపోయినందున మధ్యతరగతి ప్రజలు, వర్తకులు, కొందరు మేధావులు సాయుధ పోరాటం అవశ్యకత లేదని భావించారు. యూనియన్ సైన్యాల దాడిలో పెద్ద సంఖ్యలో కామ్రేడ్స్, నాయకులను చంపారు. 1951 చివరిలో పార్టీ కేంద్ర కమిటీ సమావేశమై సాయుధ పోరాటాన్ని ఉపసంహరించాలని నిర్ణయించింది.

తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా నిజాం నిరంకుశ పాలన, ఫ్యూడల్ పాలన రద్దయి, భారత యూనియన్‌లో విలీనమైంది. భూస్వాముల వద్ద వేల ఎకరాల భూ కేంద్రీకరణ బద్దలైంది. రెండు పర్యాయాలు భూసంస్కరణల ద్వారా ఇది సాధ్యమైనా పేదలకు తగినంత భూమి దక్కలేదు. భూ సంస్కరణలు దేశం ముందు ప్రధాన ఎజెండా అయింది. తెలంగాణలో అమానుషమైన వెట్టిచాకిరీ రద్దయింది. ప్రజలలో చైతన్యం పెరిగింది. వర్గ పోరాటం కొనసాగింది. భూస్వాములు, వారి తాబేదార్లు, ముందు కాంగ్రెసులో, తర్వాత తెలంగాణ ప్రజాసమితి, తెలంగాణ రాష్ట్ర సమితిలలో చేరారు. మళ్ళీ ఇప్పుడు మతోన్మాద బీజేపీలో భాగమౌతున్నారు. బీజేపీ వారు హిందూ-ముస్లిం పోరాటంగా సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి "ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువుల పోరాటం"గా చిత్రీకరిస్తున్నారు. ఇందులో హిందువులు, ముస్లింలు అందరూ పాల్గొన్నారు. ముస్లిం కార్మికులు సాయుధ పోరాటానికి మద్దతిచ్చారు. సాయుధ పోరాటం, దాడులు చేసిన రజాకార్లను తప్ప, ముస్లిం పౌరులను చంపలేదు. యూనియన్ సైన్యాలు వచ్చిన తర్వాత వారి చాటున మహారాష్ట్రలో కొంతమంది ముస్లింలను ఆర్.ఎస్.ఎస్.కు సంబంధించినవారు చంపారు. తెలంగాణలో అలాంటి ఘటనలు జరగలేదు.

భారత యూనియన్‌లో హైదరాబాదు సంస్థానం విలీనంలో కాంగ్రెసు పాత్ర కూడా కొంత వుంది. అందులో మితవాదుల పాత్ర నామమాత్రం. స్వామి రామానంద తీర్థ నాయకత్వాన ఉన్న కాంగ్రెసు జాతీయవాదులు గట్టిగా పోరాటం చేశారు. కాని సాయుధ పోరాటానిదే ప్రధాన పాత్ర. బి.జె.పి. మరొక వక్రీకరణ ఆనాటి భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ వల్ల మిలటరీ హైదరాబాదును విలీనం చేసిందనేది కేవలం దుష్ప్రచారం మాత్రమే. సాయుధ పోరాటం మరింత విస్తరించి కమ్యూనిస్టులు హైదరాబాదు సంస్థానం తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంటుందనే భయంతోనే మిలటరీని పంపారు. ఇది లాలూచీ కుస్తీ. వేలాదిమందిని చిత్రహింసలు పెట్టిన, హత్యలు చేయించిన నిజాంను అరెస్టు చెయ్యకపోగా, రాజప్రముఖ్‌ను చేసి కోటి రూపాయల రాజభరణం ఇచ్చారు. ఇది "విముక్తా" "రాజీ"నా ప్రజలు అర్థం చేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటం కాలంచెల్లిన భూస్వామ్య వ్యవస్థ దాని ఉపరితలం నిర్మాణమైన నికృష్టమైన నిజాం సర్కారు ప్రభుత్వంపైన జరిగిన పోరాటం. గత సంవత్సరం ఎం.ఐ.ఎం. నాయకుడు పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ స్వయంగా, దీనిని ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంగా వర్ణించారు. ఐతే ఒక వామపక్ష జర్నలిస్టు, ముస్లిం మేధావుల సంస్థ వ్యవస్థాపకుడు, ఈ పోరాటాన్ని కమ్యూనిస్టులకున్న ముస్లిం వ్యతిరేక భావం వల్ల వచ్చిందనే అర్థంలో వ్యాసం రాయడం విచారకరం.

ఇది మత పోరాటం కాదు. వర్గ పోరాట స్వభావం కలిగిన పోరాటం. ఆయన విమర్శ ముస్లిం మేధావుల్లో విషబీజాలు నాటుతుంది. ఆయన పునరాలోచించుకోవాలి. ఈ విమర్శ చర్చ కోసమే ఐతే అది వేరే విషయం. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రజాస్వామ్యం కోసం, పౌరహక్కుల కోసం, సంస్థానాన్ని భారత యూనియన్లో విలీనంకోసం జరిగిన పోరాటం. ప్రస్తుత నక్సలైట్ పోరాటం తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగింపు అనే వాదన పూర్తిగా తప్పు. పోరాటం చైతన్యవంతులైన ప్రజలు నడుపుతారు. మంచి నిర్మాణం, పరిపక్వ నాయకత్వం కలిగిన కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించాలి. సాయుధ పోరాటాన్ని, మిలటరీ జోక్యం తర్వాత వెంటనే ఉపసంహరించి ఉండాల్సిందని ఒక వాదన. 1951 లో ఉపసంహరించడం తప్పని, దానిని కొనసాగించాల్సి వుండేదని వామపక్షాలలో వాదోపవాదనలు జరిగాయి. కొందరు నక్సలైట్లు, తమది సాయుధ పోరాటం కొనసాగింపు అని కూడా వాదించారు. ఇది సరైన వాదన కాదు. ఆంధ్ర ప్రాంతానికి సాయుధ పోరాటాన్ని పొడిగించాలని చేసిన నిర్ణయం, సరైంది కాదు. అక్కడ సాయుధ పోరాటానికి అవసరమైన పరిస్థితులు లేవు. దానివల్ల తీవ్రమైన నష్టం జరిగింది. అపారమైన త్యాగాలు అక్కడి కామ్రేడ్స్ చేశారు. ఏదేమైనా తెలంగాణ సాయుధ పోరాటం, చరిత్రాత్మకమైన మహత్తర పోరాటం. ఆ అమరవీరులకు, పోరాటంలో పాల్గొన్న లక్షలాదిమంది ప్రజలకు, నాయకత్వం వహించిన నాయకులకు జోహార్లర్పించి, వారి లక్ష్యాలను కొనసాగించే ప్రతిన తీసుకుందాం. మన దేశంకోసం, మన కోసం, మన స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన, పోరాడిన ఆ యోధులను స్మరించుకుందాం.

1952 ఎన్నికల నాటికి సి.పి.ఐ.పై నిషేధం తొలగనందున పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ పేరుతో కమ్యూనిస్టులు + ప్రజాతంత్ర వాదులు కలిసి పోటీ చేశారు. చేయి గుర్తుతో పోటీ చేశారు. అనేకమంది పార్టీ నాయకులు జైళ్ళలోనో, రహస్య జీవితం గడుపుతున్నందునో వారి పేర్లు ఓటర్లుగా నమోదు కాలేదని కొన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయలేదు. అయినా తెలంగాణలో మెజారిటీ స్థానాల్లో పి.డి.ఎఫ్. గెలిచింది. రావి నారాయణరెడ్డి నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుండి నెహ్రూ కంటే ఎక్కువ ఓట్ల మెజారిటీతో గెలిచారు. నిజాం సంస్థానంలోని కర్నాటక, మహారాష్ట్ర జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీ బలహీనంగా ఉండటంతో కాంగ్రెసుకు వచ్చిన మెజారిటీతో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటైంది. మరొకవైపు రజాకార్లు స్వల్ప శిక్షలతో బయటపడితే, కమ్యూనిస్టులపై సుదీర్ఘ శిక్షలు పడ్డాయి. 12 మందికి మరణశిక్షలు విధించారు. దేశవ్యాపితంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు, ఆందోళన జరిగింది. వాటిని ముందు యావజ్జీవ కారాగార శిక్షలుగా మార్చి, కొన్నేళ్ళకు రద్దు చేశారు. డా॥ రాజబహదూర్ గౌర్‌ను రాజ్యసభకు ఎన్నికైనా విడుదల చేయలేదు. చివరకు ఉపరాష్ట్రపతి డా॥ సర్వేపల్లి జోక్యంతో విడుదలయ్యారు. నిజాం నవాబు రాజప్రముఖ్ (గవర్నర్)గా ప్రకటించారు. ఆయన భూములు ప్రభుత్వం తీసుకున్నా 400 కోట్ల రూపాయల సంపద ఆయనకే వదిలివేసింది. సంవత్సరానికి కోటి రూపాయల రాజభరణం ఇచ్చింది. 1970ల్లో ఇందిరా గాంధీకి పార్లమెంటులో మెజారిటీ లేనప్పుడు వామపక్షాలు మద్దతిచ్చేందుకు రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ షరతు విధించాయి.

తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభించిన నాటికి ఆంధ్రమహాసభకు ఏడు లక్షల సభ్యత్వం వుంది. తెలంగాణలో పార్టీకి పదివేల సభ్యత్వం వుంది. 90 లక్షల తెలుగు భాష మాట్లాడే ప్రజల్లో 7 లక్షల సభ్యత్వం అంటే దాదాపు ప్రతి 12 మంది జనాభాలో ఒకరు ఆంధ్రమహాసభ సభ్యులు. ఈ రోజు అలాంటి పరిస్థితి లేదు. పరిస్థితులు దుర్భరంగా వున్న మాట నిజమే. కాని ప్రజలలో సాయుధ పోరాటమే ఏకైక ప్రత్యామ్నాయం అనే భావన లేదు.

గిగ్ కార్మికుల దుస్థితి అధ్వాన్నం

సి ఆదికేశవన్

దేశంలో నిరుద్యోగిత తీవ్రమవుతున్న ప్రస్తుత సమయంలో 'గిగ్ ఎకానమీ' అనే మాట వినిపిస్తోంది. చదువుకున్నవారు ఉద్యోగాలు దొరక్క ఉపాధి అవకాశాలు లేక సతమతమవుతున్నారు. ఆర్థిక అవసరాల కోసం రోజులో కొన్ని గంటల సమయం స్విగ్గీ, ర్యాపిడో, వోలా, జోమాటో, అమెజాన్ డెలివరి వర్క్స్, ఫుడ్ పాండా, ఉబర్ ఈట్స్ వంటి సర్వీసుల్లో పని చేస్తున్నవారు కోకొల్లలు. వీరిలో ఇంజినీర్లు, గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు కూడా ఉన్నారు. ఈ తరహా ఉపాధిని కల్పించే ఆర్థిక వ్యవస్థను 'గిగ్ ఎకానమీ' అంటారు. గిగ్ ఎకానమిలో పనిచేసేవారిని 'గిగ్ వర్కర్స్' అని, వీరు చేసేపనిని 'గిగ్ వర్క్' అని అంటారు. తమ పని గంటలను ఎంపికచేసే సౌలభ్యం వీరికుంటుంది. రోజురోజుకు గిగ్‌వర్కర్ల వాటా గణనీయంగా పెరుగుతోంది. వీలున్నప్పుడు పనిచేస్తూ తాత్కాలిక ఆదాయం సంపాదిస్తున్న గిగ్ వర్కర్స్ దేశవ్యాప్తంగా 2020-21 నాటికి 75 లక్షల మంది ఉన్నట్లు నీతి ఆయోగ్ జూన్ 2022 నివేదిక వెల్లడించింది. మండు వేసవిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో, కుంభవృష్టిలో తుపానులో సైతం పగలు, రాత్రి తేడాలేకుండా గిగ్‌వర్కర్ల పని మన దేశ ఆర్థిక

వ్యవస్థకు అద్దం పడుతోంది. మనం దేనికోసం చింతించాల్సిన అవసరం లేకుండా సౌఖ్యంగా మనం ఇంటిలో ఉండి కేవలం స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా దేనికైనా ఆర్డర్ చేస్తే చాలు... క్లిష్ట పరిస్థితులనుసైతం తట్టుకుని మనకు కావలసినవాటిని అందించే గిగ్ వర్కర్ల ఆర్థిక పరిస్థితి, నేపథ్యం చూస్తే..

నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్స్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) సర్వే ప్రకారం, భారతదేశంలో ఒక గిగ్ వర్కర్ సగటున వారానికి 69.3 గంటలు పని చేస్తాడు. అంటే వారానికి ఏడు రోజులు, రోజుకు దాదాపు 10 గంటలపాటు పనిచేసినట్లే. ఆదివారం కూడా వీరికి సెలవు లేదు. ఈ సర్వేలో ఇతర రంగాల్లోని కార్మికులు వారానికి సగటున 56 గంటలు పనిచేస్తారు. గిగ్ కార్మికులు రోజుకు 8-12 గంటల పాటు తమ బైక్‌లను నడపాలి. వీరికి ఇన్సూరెన్స్‌కూడా ఉండదు. ఒక సగటు గిగ్ వర్కర్ పనిచేసే గంటలు, అర్హత, అతను సంపాదించే కొద్దిపాటి సంపాదన కోసం మన దేశంలోని నగరాల్లోని కార్మికులు ఎవరూ ఇంతగా శ్రమించరనేది మాత్రం స్పష్టం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇతర కార్మికులతో పోలిస్తే సగటు గిగ్ వర్కర్ అర్హతలు కూడా మెరుగ్గా ఉంటాయి. డిగ్రీలు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు ఉపాధికోసం ఈ రంగాన్ని ఎంచుకుం టున్నారు. ఉద్యోగాలు చేసేవారు సైతం వారి ఖాళీ సమయాల్లో, వారాంతాల్లో గిగ్ వర్కర్లుగా ఉన్నారు. మన దేశంలోని 75శాతం గిగ్ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందు లను ఎదుర్కొంటున్నారనేది ఈ నివేదిక స్పష్టం చేసింది. సగటున, ఒక గిగ్ వర్కర్ కేవలం నెలకు రూ.18,000 కోసం అవిశ్రాంతంగా కష్టపడి పనిచేసినా పూర్తిగా అందని పరిస్థితి. కుటుంబాన్ని నెట్టుకురాలేని స్థితిలో గిగ్ కార్మికులున్నారు. పేలవమైన పని పరిస్థితులను గిగ్ కార్మికులు ఎదుర్కొంట న్నారు. ఎండ, వేడి వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, ఆదాయ అస్థిరతలతో గిగ్ వర్కర్లు తీవ్ర ఆర్థిక లోటుపాట్లకు గురవు తున్నారు. ముఖ్యంగా వీరికి సామాజిక భద్రత, ఆరోగ్య బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు, చెల్లింపులతో కూడిన సెలవులు అందుబాటులో లేకపోవడం, తక్కువ వేతనాలు, ఉద్యోగ అభద్రత గిగ్ వర్కర్‌లు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు. ముఖ్యంగా గిగ్ కార్మికులు రోడ్డు ప్రమాదాలకి గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన సమస్యలు వీరి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం మనం చూస్తున్న ఆధునిక గిగ్ కార్మికులకు ముందు సాధారణంగా సంగీతకారులు, హాస్యనటులు ఈ పదాన్ని ఉపయోగించారు. ఈ రంగాల్లోని కళాకారులకు సక్రమంగా జీతం లభించదు. వారి వ్యక్తిగత సామర్థ్యాన్నిబట్టి చెల్లింపులు ఉంటాయి. ఒక హాస్యనటుడు కంపెనీలో షో చేస్తే, అది అతనికి గిగ్ వర్క్ అవుతుంది, వ్యక్తిగత సామర్థ్యంపైనే అతని సంపాదన ఉంటుంది. మొట్టమొదటిసారిగా 'గిగ్' పదాన్ని 1952లో తాత్కాలిక చెల్లింపుల ఉద్యోగం నిమిత్తం ఉపయోగించారు. ప్రముఖ రచయిత జాక్ కెరోవాక్ రైలు-రోడ్డు వ్యవస్థలో బ్రేక్‌మ్యాన్‌గా పని చేయడానికి గిగ్‌ను ఎలా పొందారనే దానిపై ఒక కథనాన్ని రాశారు. అప్పటినుంచి ఈ గిగ్ పదం నూతన ఆర్థిక వాస్తవికత దాల్చింది.

10సంవత్సరాలుగా ఫ్రీలాన్సింగ్ కూడా గిగ్ కేటగిరీలో చేర్చడమైంది. గత నాలుగు సంవత్సరాలలో కోవిడ్ అనంతరం గిగ్ ఆర్థిక వ్యవస్థలో అద్భుతమైన వృద్ధిని నమోదుచేసింది. ఈ ఆర్థిక వ్యవస్థను రెండు భాగాలుగా విభజించవచ్చు. ఒకటి సర్వీస్ ఆధారిత గిగ్ కాగా మరొకటి మౌలిక గిగ్. నైపుణ్యత తక్కువగా ఉన్న డెలివరీ ఏజెంట్లు, కాగా మరొకటి కనల్టెంట్‌లు, డేటా సైంటిస్టుల వంటి ఉన్నత-నైపుణ్యం కలిగిన ఉద్యోగాల ద్వారా సేవలందించడం మరొకటి. వీరిని బ్లూ కాలర్ గిగ్ వర్కర్లు, వైట్ కాలర్ నాలెడ్జ్ వర్కర్లు అని కూడా పిలుస్తారు. సాధారణంగా గిగ్ వర్కర్లు మొదటి కేటగిరీకి గిగ్ వర్తిస్తుంది. ఉబర్, ఓలా, జొమాటో, స్విగ్గీ, అర్బన్ కంపెనీ, పోర్టర్, జెప్టో వంటి కంపెనీల్లో పనిచేసే వారి పని డెస్క్ జాబ్‌లకు భిన్నంగా ఉంటుంది. వాస్తవంగా ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ సేవలను అందిస్తున్నవారు సాధారణ ఉద్యోగాలతో పోల్చితే గిగ్ ఎకానమీ వల్ల ఉద్యోగులకు, యజమానులకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. గిగ్ ఉద్యోగుల నియామ కంలో ఎటువంటి ఒప్పందాలు ఉండవు. అనవసం మైనప్పుడు గిగ్ వర్కర్‌లను విధుల నుంచి తొలగించవచ్చు. వీరు బహుళ కంపెనీలకు పనిచేయడం కూడా సాధ్యమే. అదనపు ఆదాయాన్ని పొందడానికి వీరు సైడ్‌జాబ్‌గా చేయవచ్చు. నీతి ఆయోగ్ "ఇండియాస్ బూమింగ్ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం ఎకానమీ" 2022 నివేదిక ప్రకారం, కోవిడ్ మహమ్మారి కంటే ముందు, భారతదేశంలో దాదాపు 3 మిలియన్ల మంది గిగ్ కార్మికులు ఉన్నారు. 2021 నాటికి ఈ సంఖ్య 7.7 మిలియన్లకు చేరగా 2030 నాటికి ఈ సంఖ్య 23.5 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా.

ఇ-మెయిల్

కేంద్రం ఆదుకోవాలి

భారీ వర్షాలు, వరదలతో ఆంధ్ర ప్రదేశ్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. బుడమేరు, కృష్ణా వరదలతో బెజవాడలో పౌర జీవనం తీవ్రంగా దెబ్బతినగా, ఆ కష్టం తీరక ముందే రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు ముంచెత్తాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రను దారుణంగా దెబ్బతీశాయి. ఏజెన్సీ ప్రాంతంలో వందలాది గ్రామాలకు రాకపోకలు కూడా ఆగిపోయాయి. బెజవాడలో అనేక ప్రాంతాల్లో నిలిచిన వరద నీటికి లక్షలాది మంది నిర్వాసితులు కాగా అపార ధన నష్టం వాటిల్లింది. గండ్లు పూడ్చడానికి సైన్యం సహాయం సైతం తీసుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా చెరువులూ, వాగులూ పొంగి పొర్లుతున్నాయి. రోడ్లు, మౌలిక సదుపాయాలూ దెబ్బతిన్నాయి. పంటల నష్టం అపారం. తక్షణ పరిస్థితిని, దీర్ఘ కాలిక ప్రభావాన్ని అంచనా వేసి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపశమన కార్యక్రమాలు, చేయూత ప్రణాళికల్ని అమలు చేయాల్సి ఉంది. దెబ్బతిన్న మౌలిక వసతుల్ని బాగు చెయ్యడం, చిట్టచివరి వ్యక్తికి కూడా సాయం అందేలా చూడడం, జనజీవనం, ఉపాధి కార్యక్రమాలు తిరిగి మామూలు పరిస్థితికి వచ్చేలా తోడ్పాటు అందించాలి. వీటన్నిటికీ నిధులు అవసరం. కావున కేంద్రం జాగు చెయ్యక అదనపు నిధుల్ని అందించాలి. ఆపద తీవ్రత దృష్ట్యా జాతీయ విపత్తుగా ప్రకటించి మొదటి విడత నిధుల్ని వెంటనే అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం ఉండేలా చూడాలి. జరిగిన నష్టంతో పాటు, వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పని చేయాల్సి ఉంది. కరోనా తర్వాత రాష్ట్రం ఎదుర్కొంటున్న అతి పెద్ద విపత్తు ఇదే.

డా.డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ

ఎన్నికల ప్రచారం కోసం ఎంపీకి బెయిల్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీంలోని బారాముల్లా నియోజకవర్గం ఎంపీ షేక్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్‌కు పాటియాలా హౌస్ కోర్టు మంగళవారం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం అక్టోబర్ 2వ తేదీ వరకూ ఆయనకు బెయిల్ ఇచ్చింది. గడువు పూర్తి కాగానే ఆయన ఎన్ఐఏ ముందు లొంగిపోవాల్సి ఉంటుంది. రషీద్‌ను టెర్రర్ ఫండింగ్ కేసులో చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2017లో ఎన్ఐఏ అరెస్టు చేసింది. 2019 నుంచి ఆయన తీహార్ జైలులో ఉంటున్నారు. కశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థలు, వేర్పాటువాదులకు ఉగ్రనిధులు అందజేశారన్న ఆరోపణలపై కశ్మీర్ వ్యాపారి జహూర్ వతలిని అరెస్టు చేసి విచారణ జరిపినప్పుడు రషీద్ పేరు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో కశ్మీర్ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ అధినేత సయద్ సలాహుద్దీన్ సహా అనేకమంది పేర్లను ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. కాగా, రషీద్ ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను ఓడించారు.

శశిథరూర్‌కు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని 'శివలింగంపై తేలు' అంటూ 2018లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో ప్రొసీడింగ్స్‌పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు ఊరట లభించింది. ఈ కేసు ప్రొసీడింగ్స్‌పై సుప్రీంకోర్టు మంగళవారం తాత్కాలిక స్టే ఇచ్చింది. పరువునష్టం కేసు కొట్టివేయాలంటూ థరూర్ చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు ఆగస్టు 29న తోసిపుచ్చింది. దీంతో సుప్రీంకోర్టును థరూర్ ఆశ్రయించారు. న్యాయమూర్తులు హృషీకేశ్ రాయ్, ఆర్.మాధవన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం తాజాగా కేసు విచారణ జరిపింది. శశిథరూర్ తరపు న్యాయవాది మొహమ్మద్ అలీ ఖాన్ కోర్టులో తన వాదన వినిపించారు. పరువునష్టం కేసు వేసిన బీజేపీ నేత రాజీవ్ బబ్బర్ తొలుత ఈ వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కానీ, వాటిని ప్రచురించిన మ్యాగజైన్‌ను కానీ కేసులో చేర్చడంలో విఫలమయ్యారని అన్నారు.

రాహుల్ ఎన్నటికీ ప్రధాని కాలేరు: లలన్ సింగ్

బీహార్: కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో బీజేపీ పాలకులనే లక్ష్యంగా విమర్శలు గుప్పించడంతో ఆ పార్టీ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. రాహుల్‌కు దేశభక్తి లేదని, విదేశీ గడ్డపై దేశాన్ని విమర్శించడం ఆయనకు తగదని మండి పడుతున్నారు. విదేశీ వేదికలపై భారత్‌ను అవమానించడం చైనాను ప్రశంసించడం రాహుల్‌కు అలవాటుగా మారిందని దుయ్యబడుతున్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ (లలన్) సింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్నాలో మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాహుల్ గాంధీకి దేశభక్తి లేదని, ఆయన విదేశాలకు వెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటారని అన్నారు. రాహుల్‌కు పరిణితి లేదని, ఆయన ఇంకా నేర్చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని పాలించాలని రాహుల్ కలలు కంటున్నారని, కానీ ఆయన కలలు ఎన్నటికీ నెరవేరవని లలన్ సింగ్ ఎద్దేవా చేశారు. కాగా, వరుస ఓటములతో రాహుల్ గాంధీ తన అసహనం వెళ్లగక్కుతున్నారని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. విదేశీ గడ్డపై సొంత దేశాన్ని విమర్శించడం దేశభక్తి కలిగిన వారు చేయాల్సిన పని కాదని హితవు పలికారు.

పట్టాలపై సిలిండర్లు, ఇనుపరాడ్లు

రైలు ప్రమాదాలకు భారీ కుట్రలు: రైల్వే నివేదిక

న్యూఢిల్లీ: రైలు పట్టాలపై జరుగుతోన్న దుశ్చర్యలను భారత రైల్వే తీవ్రంగా పరిగణించింది. దీనికి సంబంధించిన కీలక వివరాలు వెల్లడించింది. రైళ్లను పట్టాలు తప్పించి... ప్రమాదాలకు గురిచేసేలా కుట్రపూరిత ప్రయత్నాలు ఇటీవల కాలంలో పెరిగాయని పేర్కొంది. ఆగస్టు నుంచి ఈ తరహాలో 18 ఘటనలు వెలుగుచూశాయని తెలిపింది. కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు పెట్టి... రైలుకు ప్రమాదం తలపెట్టేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల తరచూ వెలుగు చూస్తున్నాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే నివేదిక వెల్లడించింది. అందులో ఆగస్టులో 15, సెప్టెంబర్‌లో ఇప్పటివరకు మూడుసార్లు ఇలాంటి పరిస్థితులు కనిపించాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్, తర్వాత పంజాబ్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత ప్రయత్నాలు బయటపడ్డాయి. వీటివల్ల ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలాఉంటే... ఆదివారం మరోసారి కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ ఘటనలు వెలుగుచూశాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీకి వెళ్తున్న కాళింది ఎక్స్‌ప్రెస్ కాన్పూర్ సమీపంలో పట్టాలపై ఉన్న గ్యాస్ సిలిండర్‌ను ఢీకొట్టింది. ట్రాక్‌పై ఏదో అనుమానాస్పద వస్తువు ఉన్నట్లు గుర్తించిన లోకోపైలట్... వెంటనే అత్యవసర బ్రేకులు వేశారు.

అయినప్పటికీ రైలు ఆ సిలిండర్‌ను ఢీకొనడంతో అది పట్టాలకు కొంత దూరంలో ఎగిరిపడింది. అయితే రైలుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లోకో పైలట్, రైల్వే గార్డు దీనిపై పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టాల సమీపంలో ధ్వంసమైన సిలిండర్‌తో పాటు ఒక పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టె, నాలుగు గ్రాముల పేలుడు పదార్థాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అజ్మీర్ సమీపంలోని పట్టాలపై సిమెంట్ బ్లాకులను అధికారులు గుర్తించడంతో ప్రమాదం తప్పింది.

'హేమ కమిటీ' మేమే ఏర్పాటు చేశాం

కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం: కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక మాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. చాలామంది సినీతారలు చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న భయానక అనుభవాలను వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ హేమ కమిటీ ఏర్పాటు అంశంపై కేరళ సీఎం పినరయి విజయన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ సినీ పరిశ్రమలో జోక్యం చేసుకొని జస్టిస్ హేమ కమిటీ తరహా కమిటీలు ఏర్పాటు చేయలేదని, కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్నందునే ఇది సాధ్యమైందన్నారు. ఇప్పటికే ఈ కమిటీ ముందు వాంగ్మూలాలు ఇచ్చినవారు, ఇవ్వని వారు సైతం పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. పశ్చిమ బెంగాల్‌లో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో మహిళల భద్రతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు. మంగళవారం తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన సీఎం విజయన్... దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళలపై దాడులు కొనసాగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 'బిల్కిస్ బానో కేసులో నిందితుల విడుదల, వారికి ఘనస్వాగతం పలకడం వంటి పరిణామాలు సమాజానికి తప్పుడు సందేశాన్నిచ్చాయి. జాతీయస్థాయిలో ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నందున కేరళ ప్రభుత్వం మహిళల భద్రతకు భరోసా ఇచ్చేలా కచ్చితమైన విధానాలతో ముందుకెళ్తోంది. సినీ పరిశ్రమలో అనేక సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో మరే ఇతర రాష్ట్రమూ ఈ తరహాలో సినీ పరిశ్రమలో జోక్యం చేసుకోలేదు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. తాజా పరిస్థితుల కారణంగా జస్టిస్ హేమ కమిటీ తరహాలో ప్యానెళ్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు అనేక రాష్ట్రాల్లో వస్తున్నాయి. కమిటీ నివేదికకు సంబంధించి న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతున్నాయి. అలాంటి ఫిర్యాదులు ఏవి వచ్చినా దర్యాప్తు వ్యవస్థ రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉంది' అని చెప్పారు.

చర్యలెందుకు తీసుకోలేదు

కేరళ హైకోర్టు

తిరువనంతపురం: హేమ కమిటీ నివేదికకు సంబంధించి కేరళ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసింది. మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులను ఆ కమిటీ బయటపెట్టిన తర్వాత కూడా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని ప్రశ్నించంది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏమి చేస్తున్నారని నిలదీసింది. నాలుగేళ్లు ఖాళీగా కూర్చున్నారా అని ప్రభుత్వం తీరుపై ఆందోళన వ్యక్తం చేసింది. 'రాష్ట్రం ఉదాసీన వైఖరి మమ్మల్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఒక కమిటీ వేసి, నాలుగేళ్లు ఖాళీగా కూర్చున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మీరు ఏం చేస్తున్నారు. మనలాంటి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఉండటం దారుణం. మన రాష్ట్రంలో మహిళల జనాభానే అధికం. ఈ వేధింపుల వ్యవహారం చిన్న విషయం కాదు. సిట్ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. ప్రభుత్వం మౌనాన్ని ఒక అవకాశంగా చూడొద్దని, వివక్షాపూరిత పరిస్థితులు మారాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న చట్టాలతో సమస్యలకు పరిష్కారం లభించకపోతే... కొత్త చట్టాలు తీసుకురావడం గురించి ప్రభుత్వాలు యోచించాలని సూచించింది.

వినేశ్ ఫొగాట్ వర్సెస్ యోగేశ్

బీజేపీ రెండో జాబితా విడుదల

చండీగఢ్: అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ హర్యానాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అన్ని పార్టీలు అభ్యర్థుల జాబితా విడుదల చేస్తున్నాయి. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పోటీ చేస్తుండటంతో జులానా అసెంబ్లీ నియోజకవర్గం వార్తల్లో నిలిచింది. ఆమె కాంగ్రెస్ అభ్యర్థి కాగా...ఆమె ప్రత్యర్థిగా యువనేత కెప్టెన్ యోగేశ్ బైరాగిని బీజేపీ బరిలో దింపింది. దాంతో అక్కడ వినేశ్ వర్సెస్ యోగేశ్‌గా మారింది. హర్యానాలో మొత్తం 90 నియోజకవర్గాలు ఉండగా... 21 మంది అభ్యర్థులతో బీజేపీ మంగళవారం రెండో జాబితా విడుదల చేసింది. అందులోనే జులానా నుంచి యోగేశ్‌కు టికెట్ కేటాయించినట్టు వెల్లడించింది. ఆయన భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు. బీజేపీ క్రీడావిభాగం హర్యానా శాఖకు కో కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనది జింద్ జిల్లా. బీజేపీ ఇప్పటికే 67 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాలో వినేశ్ పేరును కాంగ్రెస్ ప్రకటించింది. మరో రెజ్లర్ బజరంగ్ పునియాకు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ వర్కింగ్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పజెప్పింది. గత శుక్రవారం కాంగ్రెస్ పార్టీ 31 మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేసింది.

ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదన్న రాహుల్ వాదన సబబే: తేజస్వి

సమస్తిపూర్ (బీహార్): ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని... ఒక పార్టీగా బీజేపీ మెజారిటీని కోల్పోయిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మద్దతు పలికారు. అమెరికా పర్యటనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటన గురించి మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిస్తూ... ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే బీజేపీకి సీట్ల సంఖ్య 240 కంటే చాలా తక్కువగా ఉండేదన్నారు. బీజేపీ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను వదులుతారనేది రహస్యమేమీ కాదని యాదవ్ అన్నారు. మరోవైపు మహారాష్ట్రలో మనం చూసినట్లుగా... కేంద్రంలోని అధికార పార్టీతో పొత్తు పెట్టుకుంటే ఎవరైనా పునీతులైపోతారని ఎన్సీపీ చీల్చిన అజిత్ పవార్ గురించి పరోక్షంగా ఆయన వ్యాఖ్యానించారు. ఏది ఏమైనప్పటికీ 400కు పైగా స్థానాలు సాధిస్తామని చెప్పుకున్నవారు 240కి తగ్గారని... ఇది ప్రారంభం మాత్రమేనని తేజస్వీ తెలిపారు. ప్రజల్లో బీజేపీ పట్ల వ్యతిరేకత మరింత తీవ్రమవుతుందని తెలిపారు. బీహార్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 23 స్థానాల్లో కేవలం నాలుగింటిని మాత్రమే గెలుచుకున్నప్పటికీ వచ్చే ఏడాది జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికలలో స్థానిక అంశాలే పైచేయి అవుతాయని 243 మంది సభ్యుల అసెంబ్లీలో ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న యాదవ్ అన్నారు. సమస్తిపూర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తేజస్వీ పాల్గొన్నారు. 'భారతరత్న దివంగత కర్పూరీ ఠాకూర్ జన్మస్థలమైన సమస్తిపూర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం మాకు సంతోషంగా ఉంది. నేను తగిన సమయంలో రాష్ట్రమంతటా పర్యటించి అట్టడుగు స్థాయి కార్యకర్తల నుండి పార్టీ బలోపేతానికి అభిప్రాయాలను తీసుకుంటాను" అని యాదవ్ వెల్లడించారు.

నిరసనలు అణచివేయడానికే...

మమతపై వైద్యురాలి తల్లి ఆగ్రహం

కోల్‌కతా: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. అవి నేటికి కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిరసనల నుంచి దుర్గా పూజల వైపు దృష్టి మరలించాలంటూ పశ్చిమ బెంగాల్ ప్రజలకు సీఎం మమతా బెనర్జీ సూచించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మమత వ్యాఖ్యలపై వైద్యురాలి తల్లి మంగళవారం కోల్‌కతాలో స్పందించారు. మమత వ్యాఖ్యలను ఆమె ఖండించారు. తమ కుమార్తె హత్యాచార ఘటనలో న్యాయం జరగాలంటూ జరుగుతున్న నిరసనలు అణిచివేసేందుకు మమత ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమార్తె దారుణ హత్యకు గురై తాము బాధపడుతున్న వేళ... మమత చేసిన ఈ వ్యాఖ్యలు సున్నితత్వానికి దూరంగా ఉన్నాయన్నారు. ప్రతి ఏడాది దుర్గా పూజను తమ కుమార్తెతో కలిసి జరుపుకునే వారమని ఆమె గుర్తు చేసుకున్నారు. కానీ భవిష్యత్తులో తమ కుమార్తెతో దుర్గా పూజ మాత్రమే కాదు... ఏ పండగ కలిసి నిర్వహించుకోలేమన్నారు. ఇదే తరహా ఘటన మమత కుటుంబంలో జరిగితే... ఆమె ఇలాగే స్పందించే వారా అని ఆమె ప్రశ్నించారు. తమ కుమార్తెకు న్యాయం జరగాలంటూ చాలా రోజులుగా ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. వాటిని అణిచివేసేందుకు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒకటన్నారు. తన కుమార్తెను హత్య చేయడం ద్వారా తన ఇంటి దీపాన్ని శాశ్వతంగా ఆర్పేశారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.

పర్యావరణహిత వాహనాలపై దృష్టి: మోదీ

న్యూఢిల్లీ: స్వచ్ఛమైన, పర్యావరణహిత వాహనాలపై ఆటోమేకర్లు దృష్టిసారించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత ఆటోమొబైల్ మ్యాన్యుఫ్యాక్చర్ సొసైటీ 64వ వార్షిక సదస్సులో ప్రధాని మాట్లాడారు. భారత ఆటోమొబైల్ రంగం ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ప్రధాని అన్నారు. ఈ రంగం అధిక ఆర్థిక వృద్ధికి ఊతం, ఉత్తేజం కల్పించాలని కోరారు.

క్లీనర్, గ్రీనర్ మొబిలిటీ దిశగా ఆటోమొబైల్ రంగం దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ దేశాన్ని ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందించాలనే ప్రధాని మోదీ లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఆటోమొబైల్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ దిశగా ప్రయత్నాలు సాగితే ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని చెప్పారు. ప్రపంచంలోనే మేటి ఆటో మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీగా మనం ఎదగాలని కోరారు. 2070 నాటికి కార్బన్ రహిత మొబిలిటీకి చేరుకోవాలనే లక్ష్యం సాకారం కావాలంటే ఆటోమొబైల్ రంగంలో వినూత్న ప్రక్రియలు ప్రవేశపెట్టడం కీలకమని చెప్పారు. కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలతో మనం ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మళ్లుతున్నామని, పరిశ్రమ వృద్ధికి, నిలకడతో కూడిన వృద్ధికి ఇది కీలకమని అన్నారు.

ఎన్నికల బరిలో అఫ్జల్ గురు సోదరుడు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటుపై దాడి ఘటనలో దోషి అఫ్జల్ గురు పెద్ద సోదరుడు అజాజ్ అహ్మద్ గురు పోటీ చేస్తున్నారు. సోపోర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఆయన పోటీకి దిగుతున్నారు. నామినేషన్ల దాఖలుకు సెప్టెంబర్ 12వ తేదీతో గడువు ముగియనుంది. మూడో విడత ఎన్నికల్లో భాగంగా సోపోర్ నియోజకవర్గంలో పోలింగ్ జరగనుంది. అజాజ్ అహ్మద్ గురు 2014లో పశు సంవర్ధక శాఖ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికల్లో పోటీపై అజాజ్‌ను ప్రశ్నించగా... అందరూ ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు తానెందుకు చేయకూడదని ప్రశ్నించారు. తన సోదరుడు అఫ్జల్ గురు సిద్ధాంతాలకు భిన్నమైన ఐడియాలజీ తనదని అన్నారు. తప్పుడు కేసులతో యువకులను పోలీసులు అరెస్టు చేస్తున్నారని, పూణెలో చదువుకుంటున్న తన కుమారుడు షోయిబ్‌ను తొమ్మిది నెలల క్రితం అరెస్టు చేశారని చెప్పారు. యువకులపై తప్పుడు కేసులకు వ్యతిరేకంగా తాను పోరాటం సాగిస్తానని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జైలులో ఉన్న ఇంజనీర్ రషీద్ కోసం ఆయన కుమారుడు అబ్రార్ రషీద్ ప్రచారం చేశారని, తాను తన కుమారుడి కోసం ఎందుకు ప్రచారం చేయరాదని ప్రశ్నించారు. షోయిబ్ ఎలాంటి తప్పు చేయలేదని తాను నిరూపిస్తానని, దీనితో పాటు తప్పుడు ఆరోపణలపై కేసులు పెట్టిన అమాయక ప్రజల అంశాన్ని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్తానని అన్నారు.

సైబర్ సెక్యూరిటీ ఓ వరం: అమిత్‌షా



న్యూఢిల్లీ: దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక పోషిస్తుందని, మానవత్వానికి ఈ సాంకేతికత ఓ వరం లాంటిదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ తొలి ఆవిర్భావ దినోత్సవంలో అమిత్‌షా మాట్లాడుతూ సైబర్ నేరానికి హద్దులు లేవని, దానివల్ల కలిగే ముప్పును కలిసి ఎదుర్కొనేందుకు వాటాదారులంతా ముందుకురావాలని పిలుపునిచ్చారు. సైబర్ సెక్యూరిటీ జాతీయ భద్రతలో అంతర్భాగమని, ప్రస్తుతం ఇది అత్యంత ప్రాధాన్యత గల అంశంగా మారిందని చెప్పారు. ఇది లేకపోతే దేశాభివృద్ధి సాధ్యం కాదని, అందుకోసం మనమంతా కలసికట్టుగా కృషి చేయాలన్నారు.

దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళిక రచిస్తోందని తెలిపారు. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు రానున్న ఐదేళ్లలో 5 వేల సైబర్ కమాండోలను శిక్షణ ద్వారా సిద్ధం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని అమిత్‌షా చెప్పారు. ప్రపంచంలో జరిగే లావాదేవీల్లో 46 శాతం భారత్‌లోనే ఉన్నాయని, అందువల్ల సైబర్ ప్రపంచాన్ని సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలపై పోరాడేందుకు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నేతృత్వంలో నాలుగు ప్లాట్‌ఫామ్‌లను షా ప్రారంభించారు.

మత చిచ్చుకు బీజేపీ నేతల యత్నం

ఈసీకి జార్ఖండ్ ప్రభుత్వం లేఖ

రాంచీ: సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రాష్ట్రంలో మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న బీజేపీ నేతలు హిమంత బిస్వా శర్మ, శివరాజ్ సింగ్ చౌహాన్‌లను నియంత్రించవలసిందిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరాలని జార్ఖండ్ ప్రభుత్వం ఈసీని కోరింది. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం (ఈసీ) కమిషనర్‌కు లేఖ రాసింది. అసోం ముఖ్యమంత్రిగా ఉన్న హిమంత బిస్వాశర్మ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ రాజకీయ లబ్ధి కోసం రాష్ట్ర అధికార యంత్రాగాన్ని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని... రాష్ట్ర అంతర్గత వ్యవహారాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నారని పేర్కొంది. దీనిని నియంత్రించాల్సిందిగా హోంమంత్రి అమిత్‌షాకు సూచించాలని ఈసీని కోరింది. 81 మంది సభ్యుల జార్ఖండ్ అసెంబ్లీకి ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. జార్ఖండ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వందనా దాదెల్ ఇటీవల ఈసీకి రాసిన లేఖలో... కాషాయ పార్టీ ప్రభుత్వ, పోలీసు అధికారులను భయపెట్టే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా మతపరంగా ప్రజల మనోభావాలను ప్రభావితం చేయడం ద్వారా అలజడి, ఉద్రిక్తత సృష్టించడానికి ప్రయత్నిస్తున్నందున నివారణ, శిక్షార్హమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి జార్ఖండ్‌లో నియమించబడిన ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులపై ఏవైనా చర్యలు తీసుకునే ముందు నిష్పక్షపాతంగా ఇరుపక్షాల వాదనలకు అవకాశం ఇవ్వడం ద్వారా వివరణాత్మక విచారణను నిర్వహించాలని లేఖలో ఈసీని కోరింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో అధికారులను ఎన్నికల విధుల నుండి తొలగించిన కొన్ని ఉదాహరణలను ఈసీ దృష్టికి తెచ్చింది. రాష్ట్రంలోని ఉన్నతాధికారులను బెదిరించడం మాత్రమే కాకుండా మొత్తం పరిపాలనను స్తంభింపజేసి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించింది.

మమత ప్రభుత్వం అవినీతిమయం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని మమత ప్రభుత్వంలో అవినీతి పెరిగి పోయిందని తృణమూల్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు జవహర్ సిర్కార్ ఆరోపించారు. ఆరోగ్యశాఖలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. మంగళవారం కోల్‌కతాలో ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జవహర్ సిర్కార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్య శాఖలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలపై అవినీతి అధికారుల ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఈ శాఖలో బదిలీలు, పోస్టింగులు, నియామకాలు తదితర అంశాలన్నీ 'ఉత్తర బెంగాల్ వైద్య బృందం' కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. గతంలో ఈ అంశంపై ఆరోపణలు వెల్లువెత్తాయని గుర్తు చేశారు. ఆ ఆరోపణలు తన పరిశీలనలో నిజమని స్పష్టమైందని జవహర్ సిర్కార్ తెలిపారు. ఈ తరహా ఘటనలు నేరం కానప్పటికీ.. పాలనపై మాత్రం గణనీయమైన ప్రభావం చూపిస్తాయన్నారు. ఇదే తరహా ఘటనలు దేశవ్యాప్తంగా చోటు చేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీ సిర్కార్ ఆరోపణలు

అందుకు గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలను ఆయన సోదాహరణగా వివరించారు. ఇక మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం ఆ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్‌ను మమతా బెనర్జీ ప్రభుత్వం సస్పెండ్ చేయలేదన్నారు. కానీ వైద్యురాలి హత్యాచార ఘటన చోటుచేసుకున్న మరునాడే ఆయన ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేశారన్నారు. అనంతరం ఆయనకు బహుమతిగా మరో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా మమత ప్రభుత్వం నియమించిందని సిర్కార్ గుర్తు చేశారు.

ఇదే అంశంపై కోల్‌కతా హైకోర్టు సైతం స్పందించిందన్నారు. ఈ హత్యాచార ఘటన అనంతరం తాను సైతం ప్రొ.సందీప్ ఘోష్‌పై సస్పెన్షన్ వేటు వేయాలని పార్టీని కోరినట్లు తెలిపారు. కానీ తన మాటలు పట్టించుకోలేదన్నారు.

నన్ను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు: అనీల్ దేశ్‌ముఖ్

ముంబై: తన ఇంటిపై సీబీఐ ఎప్పుడైనా దాడి చేయవచ్చని, తనను అరెస్టు చేయవచ్చని మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, ఎన్సీపీ నేత అనీల్ దేశ్‌ముఖ్ అన్నారు. తనను అరెస్టు చేయడానికి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ... 'నాలుగేళ్లనాటి జలగావ్ కేసులో సీబీఐ నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనికి కారణం మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్. తాను హోంమంత్రిగా ఉన్నప్పుడు జలగావ్‌లో బీజేపీ నాయకుడు గిరిష్ మహాజన్ కేసులో చర్య తీసుకునేందుకు పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు నాపై ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణ కూడా ఫడ్నవీస్ కారణంగానే వచ్చింది. బహుశా నా ఇంటిపై ఎప్పుడైనా సీబీఐ దాడి చేయవచ్చు. నన్ను కూడా అరెస్టు చేయవచ్చు. దేనికైనా నేను సిద్ధంగానే ఉన్నాను' అని దేశ్‌ముఖ్ అన్నారు.

బుడమేరుపై బురద రాజకీయాలు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బుడమేరు వరదపై టీడీపీ, వైసీపీ బురద రాజకీయాలు చేస్తున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. పాత రాజరాజేశ్వరిపేటలో బాధితులను మంగళవారం ఆమె పరామర్శించారు. షర్మిల మాట్లాడుతూ, బుడమేరు వరదకు ఇద్దరూ కారణమేనని ఎద్దేవా చేశారు. చిన్న పిల్లల దగ్గర నుంచి సీఎం చంద్రబాబు విరాళాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందని, బీజేపీ నుంచి తీసుకోవాలని సూచించారు. సర్వం కోల్పోయిన కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు దాదాపు 50 మంది చనిపోవడం దారుణమని, ఏడు లక్షల మంది నిరాశ్రయులయ్యారని వివరించారు. రూ.6,800 కోట్లు నష్టంగా చంద్రబాబు చెబుతున్నారని, అయినా కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఇంత నష్టం వాటిల్లితే... రాష్ట్రానికి మోదీ ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. విపత్తుపై మోదీ స్పందించకపోవడం దారుణమని, బీజేపీ చేసిన మోసంపై చంద్రబాబు సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బుడమేరుకు వరద రాకుండా కొల్లేరు ఆపరేషన్ చేపట్టారని, బుడమేరు కట్టలకూ

జగన్ ద్రోహ ఫలితమే...

బెజవాడ ముంపు

- బుడమేరు ప్రక్షాళన చేస్తాం
- వరదపై యుద్ధం చేశాం
- అధికార యంత్రాంగానికి అభినందన
- బోట్లు వదిలినవారిపై కఠిన చర్యలు
- సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలపై విద్వేషంతో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన ద్రోహ ఫలితమే...విజయవాడ ముంపునకు కారణమని సీఎం చంద్రబాబు విమర్శించారు. వరద నివారణకు 10రోజుల పాటు అహర్నిశలూ శ్రమించి ఓ పెద్ద యుద్ధమే చూశామన్నారు. బుడమేరులో గండ్లు పూడ్చిన ప్రాంతాన్ని సీఎం పరిశీలించారు. గండ్లు పడిన తీరు, వరద ప్రవాహంపై అధికారులు ఆయనకు వివరించారు. బాధితులను కలిసి వారికి అందుతున్న సహాయక చర్యలపైనా చంద్రబాబు ఆరా తీశారు. బుడమేరుకు విజయవాడ నగరం వైపు పడిన 3 గండ్లను వైసీపీ ప్రభుత్వం ఎందుకు పూడ్చలేదని చంద్రబాబు ప్రశ్నించారు. బుడమేరు ఉగ్రరూపంతో ఈ నీరు విజయవాడ నగరాన్ని ముంచెత్తటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పులివాగు కూడా వచ్చి ఇక్కడే కలిసిందని తెలిపారు. ఆర్మీ కూడా చేతులెత్తేసే పరిస్థితుల్లో మంత్రి రామానాయుడు నేతృత్వంలోని బృందం అహర్నిశలు పనిచేసి బుడమేరు గండ్లు పూడ్చారని సీఎం గుర్తుచేశారు. మరో మంత్రి నారా లోకేశ్ వివిధ శాఖలను సమన్వయం చేస్తూ తెరవెనుక ఎంతో కృషి చేశారని అభినందించారు. బుడమేరుపై అక్రమ కట్టడాలు కట్టి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడంతో నీరు దిగువకు పారని పరిస్థితి తలెత్తిందన్నారు. బుడమేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకరు చేసిన తప్పిదంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థలను గాడిలో పెట్టడానికే రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టిందని, ఎన్నో కష్టాలు నష్టాలు ఓర్చి గండ్లు పూడ్చామని సీఎం చెప్పారు. అయినా అక్కడక్కడ లీకేజీలు ఉండటంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుద్ధి లేకుండా బోట్లు వదిలి ప్రకాశం బ్యారేజీకి ముప్పు తెచ్చే కుట్రలు పన్నారని సీఎం ధ్వజమెత్తారు. 10రోజులు విశ్రాంతి తీసుకోకుండా రాత్రిపగలు పని చేసిన అధికార యంత్రాంగాన్ని అభినందించారు. రాజకీయ ముసుగులో మాట్లాడుతున్న నేరస్తుల ముసుగు తొలగిస్తానని, ప్రకాశం బ్యారేజీలోకి వదిలిన బోట్లకు వైసీపీ రంగులు ఎందుకున్నాయని ప్రశ్నించారు. బోట్లు వదిలిన వారిని వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరదలపై యుద్ధంలో గెలిచినా... జరిగిన నష్టాన్ని మాత్రం పూడ్చలేకపోయామని వాపోయారు. దాదాపు 6లక్షల కుటుంబాలు అతలాకుతలమయ్యాయని చెప్పారు. సూర్యాస్తమయం అయ్యాక యుద్ధం చేయకూడదనే నియమాలుంటాయి కానీ వరదలపై యుద్ధంలో ఆ అవకాశం కూడా లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని సీఎం వివరించారు. ప్రతి ఒక్క బాధితుడికి న్యాయం చేసి..అంతిమంగా నిలదొక్కుకునే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హెలీకాప్టర్లు, డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం, తాగునీటిని సరఫరా చేశామన్నారు. వాహనాల స్పేర్ పార్ట్స్ కూడా వందశాతం సబ్సిడీ ఇచ్చేలా కంపెనీలతో మాట్లాడానని వివరించారు. అధికవర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలను బుధవారం ఉత్తరాంధ్రలో పరిశీలిస్తానని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖపట్నం, ఏలేరు ప్రాజెక్టు ప్రాంతాల్లో తిరిగి ఎల్లుండి నందివాడ, కొల్లేరుల్లో తిరిగి బాధితులను పరామర్శిస్తానని చెప్పారు. కొందరు వరద బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. వైసీపీ మాత్రం విషం చిమ్ముతోందని, ఓడిపోయారని..ప్రజలపై కక్ష తీర్చుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ముసుగులో మాట్లాడుతున్న నేరస్థుల ముసుగు తొలగిస్తామన్నారు.

కొండరాళ్లు మీద పడి ఒకరి మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందిన ఘటనను మరవకముందే తాజాగా మంగళవారం మధ్యాహ్నం మరో ఘటన జరిగింది. విజయవాడ మాచవరం శివాలయంవీధి వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించేందుకు మాచవరానికి చెందిన కార్మికులు ఇజ్జాడ రాము(58), బీ.కామయ్య(58), కే.రాజు (57), షేక్.హుస్సేన్ (53) వచ్చారు. ఇంటి యజమాని గూడే గోపినాథ్... ఇంటి పైభాగంలోని కొండ పై ఉన్న చెట్లు తొలగించేందుకు కార్మికులను తీసుకునివచ్చారు. మధ్యాహ్నం చెట్లను నరుకుతుండంగా ఒక్కసారిగా కొండచరియలు జారి పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇజ్జాడ రాము అక్కడిక్కడే మృతి చెందారు. కామయ్య, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. హుస్సేన్ మాత్రం ప్రమాదం నుంచి బయటపడ్డారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, రెవిన్యూ అధికారులు వివరాలు తెలుసుకుని...మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ ప్రాంతాల్లో రక్షణ చర్యలు: ముప్పాళ్ల

కొండ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ప్రమాదకరంగా ఉన్న చెట్లు, కొండ రాళ్లను తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మాచవరంలో కొండచరియలు విరిగినపడిన ప్రాంతాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరావుతో కలిసి ముప్పాళ్ల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండచరియలు విరిగిపడి ఇజ్జాడ రాము దుర్మరణం పాలయ్యాడని, మరో ఇద్దరికి తీవ్రగాయాలైయ్యాయని చెప్పారు. విజయవాడ నగరపాలక సంస్థలో కమ్యూనిస్టుల పాలన ఉండగా... కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రజలను అప్రమత్తం చేసేవారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు తీసుకుని ప్రజలు ప్రాణాలు కాపాడాలన్నారు. జి.కోటేశ్వరావు మాట్లాడుతూ నగరంలో 16 డివిజన్‌ల వరకు కొండ ప్రాంతాల్లో ఉన్నాయని... ప్రమాదాల నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మాణలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలకు ఇప్పటికే కొండ ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిందన్నారు. ప్రమాదం జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం, నగర పాలక సంస్థ నష్టపరిహారం తో సరిపెడుతున్నాయన్నారు. అలా కాకుండా కొండ ప్రాంతవాసులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అతిపెద్ద కొండలున్న మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో కూడా జాగ్రత్తలు తీసుకుంటారని, ముందుగానే ప్రజలను అప్రమత్తం చేయడంలో నగర పాలక సంస్థ విఫలమైందన్నారు. విజయవాడకు ఇంతటి విపత్తు వచ్చిపడితే... నగర మేయర్ జాడ కూడా లేదన్నారు. ఇప్పటికైన కొండచరియలు విరిగిపకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐటీయూసి నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, నగర కార్యదర్శివర్గ సభ్యుడు కొట్టు రమణారావు, అప్పరబోతు రాము, డివిజన్ కార్యదర్శి పడాల కనకా రావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, కోశాధికారి సాయికుమార్ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల తర్వాత అదే ఉగ్రరూపం

1964 సెప్టెంబరులో బుడమేరు బీభత్సం
నాటి వరద కష్టాలను కళ్లకు కట్టిన 'విశాలాంధ్ర'

విశాలాంధ్ర

విశాలాంధ్ర-విజయవాడ: సుమారు అరవై సంవత్సరాల క్రితం... అంటే 1964 సెప్టెంబర్ 29వ తేదీన కుంభవృష్టి ఫలితంగా బుడమేరు ఒక్కసారిగా ఉప్పొంగింది. అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురంను వరద ముంచెత్తింది. ఆయా ప్రాంతాల్లో వరద బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రివేళ ఆకస్మిక వరదతో అజిత్‌సింగ్‌నగర్‌లో రెండు వేల మంది ప్రజలు విపత్తుబారినపడ్డారు. దీంతోపాటు కేదారేశ్వరపేట, బీసీ కాలనీ, లేబర్‌కాలనీ, ముత్యాలంపాడు తదితర ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. 20 వేల మందికి పైగా ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి మెరక ప్రాంతాలకు చేరుకున్నారు. బుడమేరు బారి నుంచి రక్షణ పొందేందుకు నాడు ఘోరకలిపై 'విశాలాంధ్ర' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అనధికార లెక్కల ప్రకారం 10 మంది గల్లంతయ్యారు. పెద్ద సంఖ్యలో మూగజీవాలు కొట్టుకుపోయాయి. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. విజయవాడ పశ్చిమంగా ఉన్న గొల్లపూడి, రాయనపాడు, జక్కంపూడి, కొత్తూరు, నైనవరం గ్రామాల్లోకి బుడమేరు వరదనీరు ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులను చేసింది. రైలు పట్టాలపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించింది. సరిగ్గా 60 ఏళ్ల తర్వాత బుడమేరు అదే తరహాలో ఉప్పొంగింది. అప్పట్లో బుడమేరు రక్షణ కట్టకు గండ్లు పడడంతో అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాన్ని వరద ముంచెత్తింది. రెండువేల గుడిసెలు నేలమట్టమయ్యాయి. ఉన్న ఒక్క డాబా పైకి ఎక్కి చాలా మంది ప్రాణాలు దక్కించుకున్నారు. ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అధికార యంత్రాంగం పడవలు ఏర్పాటు చేసినా వరద ఉధృతికి సాధ్యపడలేదు. అదే ప్రాంతంలో ఉన్న ఆంధ్ర సిమెంట్ కంపెనీ ఆవరణలోకి నాలుగు అడుగుల మేర నీరు నిలిచింది. కంపెనీ అధికారులు, కార్మికులు కాలనీలోని గృహాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. అప్పట్లో రైల్వే కాలనీ జలమయమైంది. విజయవాడకు రైళ్లు, బస్‌ల రాకపోకలు నిలిచిపోయాయి. తంతి సంబంధాలు నిలిచిపోయాయి. నాటి 28వ తేదీ సాయంత్రం ఆనకట్టపైన కృష్ణా నది నీటి మట్టం 12 అడుగులుండగా, 29వ తేదీ ఒంటి గంటకు 17.4 అడుగులకు పెరిగింది. కుంభవృష్టి వల్ల బుడమేరుతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని తమ్మిలేరు, రామిలేరు, ఎర్రకాల్వ పొంగి కొల్లేరుకు మహోధృతంగా వరద వచ్చింది. లక్షలాది ఎకరాల పంట నీట మునిగింది. బసంగి, అక్కుళ్లు పంటలు దెబ్బతినడంతో రైతులు భయాందోళన చెందారు. పిల్లలు, వృద్ధులు ఆహారం కోసం అల్లాడిపోయారు. చెట్టుకొకరు పుట్టకొకరు చెల్లాచెదురయ్యారు. వారికోసం కుటుంబ సభ్యులు పడిగాపులు కాశారు.

వరద బాధితులను ఆదుకోండి

బుడమేరు ముంపునకు శాశ్వత నివారణ చర్యలు

చంద్రబాబుకు రైతు సంఘాల సమన్వయ సమితి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితులను ఆదుకోవడానికి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి నేతల బృందం వినతిపత్రం అందజేసింది. భారీ వర్షాలు, వరదల వల్ల రైతాంగానికి నష్టం జరిగిందని, ఈ నష్టం నుంచి రైతాంగాన్ని కాపాడుకోవాలని డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంగళవారం సీఎంను విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో కలిసి భారీ వర్షాల వల్ల నష్టపోయిన ప్రజల, రైతుల సమస్యలను వివరించింది. ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న పంట రుణాలన్నీ రద్దుచేసి... రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలబడాలని కోరింది. 19 జిల్లాలలో 5 లక్షల ఎకరాలకు పైగా ఆహార, వాణిజ్య, ఉద్యానవన, కూరగాయల పంటలన్నీ దెబ్బతిన్నాయని, ఆర్థికంగా రైతాంగానికి నష్టం వాటిల్లిందని తెలిపింది. కౌలు రైతులకు ఆర్థిక సహకారం అందించాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ఉన్న అవకాశాలను ఉపయోగించాలని విన్నవించింది. నీట మునిగిన పంటలపై గణాంకాలు చేపట్టి... పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరింది. సొసైటీ భూములు, లంక భూములు, దేవాలయ భూములు సాగు చేసే వారందరికీ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది. పాడి పశువులకు మేత, దాణా తక్షణమే అందించాలని, చనిపోయిన పశువులకు వాటి విలువ ఆధారంగా నష్టపరిహారం అందించాలని సూచించింది. భారీ వరదల వల్ల గృహాలన్నీ మునిగి నష్టపోయిన కుటుంబాలకు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా తక్షణమే ప్రతి కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేసింది. బుడమేరుకు కనీవినీ ఎరగని రీతిలో 40 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి విజయవాడనగరంతో పాటు వందలాది గ్రామాలను ముంచిందని, పంట పొలాలను దెబ్బతీసిందని వివరించింది. బుడమేరుతో పాటు కృష్ణానదికి వచ్చిన వరద కూడా అనేక లంక గ్రామాలను ముంచిందని, బుడమేరు నుంచి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం లేకుండా ఏపీ మిత్ర, కె.శ్రీరామకృష్ణయ్య కమిటీలు సూచించిన వరద నిరోధక చర్యలను వెంటనే పూర్తి చేయాలని కోరింది. ఎగువ ప్రాంతాలలో అవకాశం ఉన్నచోట రిజర్వాయర్లు నిర్మించాలని, దిగువ ప్రాంతాలలో బుడమేరు వరద ప్రవాహానికి ఉన్న అవరోధాలు తొలగించాలని, కరకట్టను పటిష్టపరచాలని సూచించింది. విజయవాడ నగరం నుంచి కొల్లేరు వరకు... అక్కడ నుండి ఉప్పటేరు సముద్రంలోకి వెళ్లేందుకు ఆటంకం ఉన్న ఆక్రమణలు తొలగించాలని, ఈ సందర్భంగా నష్టపోయిన పేదలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేసింది. రాయనపాడు నుంచి గుంటుపల్లి మధ్యగా బుడమేరుకు మరొక డైవర్షన్ ఛానల్ నిర్మించి... కృష్ణానదిలోకి వరద నీటిని మళ్లించ వచ్చునని నిపుణులు చెబుతున్నారని, ఈ అంశాన్ని పరిగణనలో తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రైతు సంఘాల సమన్వయ సమితి నాయకత్వ బృందం విన్నవించిన అంశాలన్నింటినీ సీఎం శ్రద్ధగా ఆలకించి... ఆయా అంశాలన్నింటినీ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ప్రతినిధి బృందంలో రైతుసంఘం నేతలు వై.కేశవరావు, అక్కినేని భవానీ ప్రసాద్, డి.హరినాథ్, పి.జమలయ్య, చల్లపల్లి విజయ, మరీదు ప్రసాద్‌బాబు, కొల్లా రాజమోహన్, పి.వీరాంజనేయులు, గోగినేని ధనశేఖర్, కోగంటి ప్రసాద్, కాసాని గణేశ్ బాబు, సూర్యప్రసాద్, చెరుకూరి వేణు, మల్లెపు లక్ష్మీనారాయణ ఉన్నారు.

పత్తి మద్దతు ధర రూ.7,521: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకంగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియకు చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెటింగ్ శాఖ, కాటన్ కార్పొరేషన్ (సీసీఐ) అధ్వర్యంలో రాష్ట్రంలో మొదటి దశలో 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. టన్ను రూ.7,521 మద్దతు ధరకు కొనుగోళ్లు చేస్తామన్నారు. ఈ ఏడాది 5.79 లక్షల హెక్టార్లలో ఆరు లక్షల టన్నుల దిగుబడి అంచనా వేసినట్లు తెలిపారు. గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోళ్లు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొనుగోళ్ల ప్రక్రియతో పాటు ఆన్‌లైన్ విధానం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రోజు రైతుల ప్రయోజనం కోసం సాయంత్రం ఆరు గంటల వరకు అనుమతి ఇచ్చామని చెప్పారు. పత్తి కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్, మార్కెటింగ్, వ్యవసాయ అధికారులు, పోలీసు, అగ్నిమాపక అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

బోట్ల తొలగింపునకు ఆటంకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకాశం బ్యారేజీలో బోట్ల తొలగింపు ప్రక్రియకు ఆదిలోనే ఆటంకం ఎదురైంది. బ్యారేజీలోకి మంగళవారం ముగ్గురు గజ ఈతగాళ్లను బోట్ల వద్దకు పంపారు. బ్యారేజీకి ప్రమాదం లేకుండా నదీ పరివాహంలోకి తీసుకెళ్లి 50 టన్నుల బరువు సామర్థ్యం ఉన్న రెండు భారీ క్రేన్లతో తొలగింపు చర్యలు చేపట్టారు. ప్లాన్-ఏలో భాగంగా దాదాపు 50 మందితో ఐదు గంటలపాటు పనులు కొనసాగించినా విఫలమైంది. క్రేన్లతో బోట్లను లేపేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. ఒక్కో బోటు 20 టన్నులు ఉండటం...ఒకదానికి మరొకటి చిక్కుకుని ఉండటంతో పైకి లేవలేదు. మళ్లీ ప్లాన్-బితో బోట్ల తొలగింపునకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. విశాఖ నుంచి అనుభవమున్న డైవింగ్ టీమ్‌లను రప్పించి బోట్లను ముక్కలు చేయడంగానీ, లేదా క్రేన్ల సహాయంతో బయటకు లాగి, బ్యారేజీ నుంచి దూరంగా తరలించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈనెల ఒకటో తేదీన వరదలకు ప్రకాశం బ్యారేజీ వైపునకు బోట్లు దూసుకొచ్చి, కౌంటర్ వెయిట్లను ధ్వంసం చేశాయి. 67, 68, 69 గేట్ల వద్ద నాలుగు పడవులు చిక్కుకున్నాయి. 67, 68 గేట్లు పనులను మూసివేసి తొలగింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే దెబ్బతిన్న గేట్లకు కౌంటర్ వెయిటింగ్ పనులు దాదాపు పూర్తి దశకు చేరాయి. బోట్లు దూసుకురావడంపై అనుమానాలున్నాయని ఇంజినీరింగ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేశారు. మూడు బోట్లు వైసీపీ నేతల అనుచరులకు చెందినవేనని పోలీసుల విచారణలో వెల్లడైంది. బోట్ల యజమానులు ఇద్దర్ని అరెస్టు చేశారు. దీనిపై అధికార, ప్రతిపక్ష నేతలు మధ్య పరస్పర విమర్శలు నెలకొన్నాయి.



సీఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితులను ఆదుకునేందుకు మేము సైతం అంటూ పెద్ద ఎత్తున దాతలు ముందుకు వస్తున్నారు. సీఎం సహాయనిధికి అనేక మంది ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజాగా ఏపీ విద్యుత్ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా వరద బాధితులకు అందజేశారు. మంగళవారం మంత్రి గొట్టిపాటి రవి నేతృత్వంలో సీఎం చంద్రబాబును విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలు కలిసి సీఎం సహాయ నిధికి రూ.10.60 కోట్లను అందించారు. అలానే ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు కూడా ఒక రోజు జీతాన్ని విరాళంగా అందించారు. మంత్రి కొల్లు రవీంద్ర అధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి రూ.2.70 కోట్ల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాబ్జీరావు, ఏపీ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నరసింహులు, ఏపీ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షులు కోటయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి పారిశ్రామికవేత్తలు దాదాపు రూ.3 కోట్లు విరాళంగా ఇచ్చారు. పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ప్రతినిధులు ఒక నెల గౌరవ వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇస్తూ అంగీకార పత్రాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అందజేశారు. ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్, ఏపీ సర్పంచుల సంఘం ప్రతినిధులు రూ.7 కోట్ల 70 లక్షలు, ఏపీ సర్పంచులు సంక్షేమ సంఘం ప్రతినిధులు రూ.3,92,91,000 ఇస్తూ చేసిన తీర్మాన పత్రాలు అందజేశారు. మంగళవారం సీఎం చంద్రబాబుకు విరాళాలు అందజేసిన వారిలో కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.3 కోట్లు, నారాయణ విద్యా సంస్థల నుండి రూ.2.50 కోట్లు, దక్షిణ కొరియాకు చెందిన ఎల్.జీ.కంపెనీ గ్లోబల్ కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ పాల్ కౌన్, దేవీ సీ ఫుడ్స్, అవంతి ఫీడ్స్, జెమిని ఇడిబుల్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ రూ.2 కోట్లు వంతున విరాళాలు అందజేశారు. అలానే వివిధ సంస్థలు, వ్యక్తులు రూ.పదివేల నుండి కోటికిపైగా మొత్తం 84 మంది విరాళాలను అందించారు.

విద్యుత్ ఉద్యోగుల సహాయం రూ.10.60 కోట్లు

నేటితో గృహనష్టం గణన పూర్తి

కలెక్టర్లకు సిసోడియా ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వర్షాలు, వరద ప్రభావిత జిల్లాలలో బుధవారం సాయంత్రానికి గృహనష్టం గణన పూర్తి కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవిన్యూ, విపత్తుల నిర్వహణ, భూపరిపాలన, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్) ఆర్పీ సిసోడియా స్పష్టం చేశారు. మంగళవారం విపత్తుల నిర్వహణ కార్యాలయం నుండి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఎఎస్ఆర్, కాకినాడ, ఏలూరు, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్ లతో ఫోన్ ద్వారా ఏకకాలంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో వాడుతున్న గణన యాప్ లో మాత్రమే వివరాలు నమోదు చేయాలని, అన్ని జిల్లాల కలెక్టర్లుకు యాప్ వినియోగానికి సంబంధించి యాక్సిస్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. వరద నష్టం అంచనాకు కేంద్రబృందం రాష్ట్రానికి వచ్చి ఉన్నందున... సమయాభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ సంఖ్యలో గణన బృందాలను ఏర్పాటు చేసి పనిపూర్తి చేయాలని ఆదేశించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకె బాలాజీ మాట్లాడుతూ... లంక గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు కానందున మరో రోజు సమయం కావాలని కోరగా... సిసోడియా అంగీకరించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రస్తావనపై మాట్లాడుతూ బాధితులకు బాసటగా నిలిచేదిగా నష్టం గణన ఉండాలని సీఎం స్పష్టం చేశారని... తదనుగుణంగా గృహ నష్టం అంచనాలు సానుభూతితో పూర్తి చేయాలన్నారు. మరోవైపు వ్యవసాయం, అధారిత రంగాల నష్టం గణన కూడా ఈ నెల 14వ తేదీకి పూర్తి కావాలని సిసోడియా కలెక్టర్లకు సూచించారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయంతో పాటు ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక శాఖల పరంగా జరిగిన నష్టం అంచానాలను నమోదు చేసేందుకు అధునీకరించిన యాప్ ను బుధవారం సాయంత్రానికి అందుబాటులోకి తీసుకువస్తామని, తదనుగుణ ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగాలు ఉండాలని ఆదేశించారు. ఈ సదస్సులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్ స్పెక్టర్ జనరల్, కమీషనర్ శేషగిరి బాబు, విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ నిర్వహణ సంచాలకులు రోణంకి కూర్మనాథ్, ఆయా జిల్లాల కలెక్టర్లు హరీంద్ర ప్రసాద్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, స్వప్నిల్ దినకర్. విజయ కృష్ణన్, దినేష్ కుమార్, షాన్ మోహన్, వెట్రిసెల్వి, చదలవాడ నాగరాణి, ప్రశాంతి, ప్రఖర్ జైన్, అరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

46కు చేరిన 'వరద' మృతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య అధికారికంగా 46కు చేరింది. ఇందులో ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 36 మరణాలు సంభవించాయి. మంగళవారం మృతుల సంఖ్య, నష్టం వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. అనధికారికంగా ఇంకా మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. వరదలతో 540 చిన్న, పెద్ద జంతువులు, 7697 కోళ్లు మృత్యువాతకు గురయ్యాయి. మత్స్యకారులకు చెందిన 205 బోట్లు పాక్షికంగాను, మరో 425 బోట్లు పూర్తిగాను ధ్వంసమయ్యాయి. భారీ వర్షాలతో 2455 వలలు, 4567.60 కిలోమీటర్ల పొడవున రహదారులు ధ్వంసమయ్యాయి. 19 జిల్లాల్లో 2,57,691 మంది రైతులు పంట నష్టాలకు గురయ్యారు. 2,06,195.24 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. ఉద్యాన రంగంలో 12 జిల్లాలకు చెందిన 30,877 మంది రైతులు పంట నష్టపోయారు. మొత్తంగా 19686.81 హెక్టార్ల మేర పంట నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు, వరదలతో ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఏడు జిల్లాల్లో 2,90,572 మంది బాధిత కుటుంబాలను గుర్తించారు. వారికి సహాయక చర్యల్లో ప్రభుత్వం నిమగ్నమైంది.ప్రధానంగా విజయవాడ ముంపు ప్రాంతాల్లో నిలిచిన కాలనీల్లో వరద నీటిని ఫైర్ ఇంజిన్లతో బయటకు తోడుతున్నారు. రాకపోకలకు అనువైన వాతావరణం కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. నీరు తగ్గిన చోట పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.